

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 12.10.2025 | సంపుటి : 2 | సంచిక :248 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 12.10.2025 | volume : 2 | Issue : 248 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




### ట్రంప్ మరోసారి
# సుంకాల బాంబు

## చైనా దిగుమతులపై 100 శాతం సుంకాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బాంబు పేల్చారు. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడిం చారు. ఇప్పటికే చైనాపై 30శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాణిజ్యంపై చైనా అసాధారంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. "చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా వాటికి ఈ సుంకాలు వర్తిస్తాయి" అని అమెరికా అధ్యక్షుడు తన పోస్ట్‌లో వెల్లడించారు.

10

### 42శాతం బిసి రిజర్వేషన్లపై
# సుప్రీంలో సవాల్
## హైకోర్టు స్టేతో ప్రభుత్వం నిర్ణయం
### పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సీఎం రేవంత్

బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టు కి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీంకోర్టు లో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింఘ్వీ తో పాటు సిద్దార్థ దవే.. రిజర్వేషన్ల పై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్ లతో వాదనలు వినిపించాలని నిర్ణయించినట్లు సమాచారం.

03



హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయిుచింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింగ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు.



# పప్పుల దినుసుల సాగును పెంచండి
## దిగుమతులపై ఆధారపడొద్దు

- వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్యమైన పాత్ర
- రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు : ప్రధాని మోదీ


దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు.

మిగతా 10 లో



04

## పెరిగిన బంగారం ధరలు
హైదరాబాద్‌లో 10 గ్రాముల ధర రూ. 1,24,260



10

### వాట్సప్ లేకపోతేనేం..
## అరట్టై వాడండి
సుప్రీంకోర్టు



10

## దగ్గుమందుపై తమిళనాడు సర్కార్ నిర్లక్ష్యం

- తగు చర్యలు తీసుకోక పోవడంతోనే సిరప్ మరణాలు
- కేంద్ర ప్రభుత్వవర్గాల గుర్తింపు



04

## విద్యార్థినిపై అత్యాచారం
బెంగాల్‌లో మరో దారుణం

# వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటి?
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు
- కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ



వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

02

# సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి
## కృష్ణా, గోదావరి నీళ్లు దోస్తున్నా ఉలికే లేదు
### బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వెటకారం

హైదరాబాద్, అక్టోబర్ 11 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు... నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్ రావు సెటైర్లు వేశారు. కింద నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే... పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం అవుతుందని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శిం చేందుకు కర్ణాటక వెళ్లినప్పుడు, ఆలమట్టి డ్యాం

- మిగతా 2 లో..



## జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ వార్ రూమ్
పార్టీ నేతలతో కెటిఆర్ టెలి కాన్ఫరెన్స్

02

### కృష్ణాగోదావరి జలాల్లో
# రాజీ లేదు



- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- కాళేశ్వరం నిరుపయోగంగా మారినా.. వరి సాగులో రికార్డు
- ఆల్మట్టి ఎత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- హరీష్ రావు అబద్ధాల ప్రచారం మానుకోవాలి
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్

తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తాము పోరాడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఇప్పటికే లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని చెప్పారు. అలాగే ఆలమట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా కూడా తాము ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

హనుమకొండ, అక్టోబర్ 11 : బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో కట్టకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. అయితే నీటి పంపకాల పంచాయతీలో మంత్రి హోదాలో హాజరైన ఏకైక వ్యక్తిని తానేనని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మీరు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయిందంటూ హరీశ్ రావుకు చురకలంటించారు. ఈ 22 నెలల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్ నయాపైసా కూడా పనికి రాలేదన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన

- మిగతా 2 లో..

# 14న బిసి బంద్
## కిషన్ రెడ్డి మద్దతు కోరిన కృష్ణయ్య



హైదరాబాద్,అక్టోబరు11 :బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన

- మిగతా 2 లో..



# తెలంగాణలో 4రోజుల పాటు వర్షాలు
## హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్,అక్టోబరు11: తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తమిళనాడు తీరప్రాంతం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని.. దక్షిణ ఒడిశా నుంచి ఏపీ తీర ప్రాంతం మీదుగా ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల

- మిగతా 2 లో..



# ప్రధాని మోడీతో రామ్‌చరణ్ దంపతుల భేటీ

**హైదరాబాద్, అక్టోబరు 11 :** భారత ప్రధాని నరేంద్రమోదీని సినీ నటుడు రామ్‌చరణ్ దంపతులు కలిశారు. అనిల్ కామినేని సారథ్యంలో వరల్డ్ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానితో సమావేశమైన చరణ్, ఉపాసన, అనిల్ కామినేనిలు లీగ్‌కు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికతో పాటు, ప్రత్యేకంగా తయారు చేయించిన విల్లును మోదీకి అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను రామ్‌చరణ్ పంచుకుంటూ, 'పీఎం మోదీజీ మార్గ నిర్దేశకత్వర, క్రీడలపై ఆయనకున్న ఆసక్తి విలువిద్యను ప్రపంచవ్యాప్తం చేయడానికి ఉపకరిస్తుంది. అథ్లెట్స్ అందరికీ శుభాకాంక్షలు. ఈ క్రీడలో మరింత మంది వచ్చి చేరతారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# తనపై కేసుల చిట్టా బయటపెట్టిన రాజాసింగ్

## ఎందుకు కేసులో పెట్టారో చెప్పాలని డిజిపికి లేఖ



**హైదరాబాద్, అక్టోబర్ 11 :** హైదరాబాద్‌లో తన మీద పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బయటపెట్టారు. అక్రమ కేసులను నమోదు చేయడానికి గల కారణం ఏంటో చెప్పాలని రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. మధ్య ప్రదేశ్‌లో జరిగిన ఓ హిందూ సభలో తాను మాట్లాడిన మాటలను పోలీసులు వక్రీకరించి కేసు నమోదు చేసారని ఫిర్యాదు చేశారు. హైరాదాబాద్ సిటీకి సంబంధం లేకుండా కేసు ఎలా పెడతారని లేఖలో ప్రశ్నించారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. రాజాసింగ్ ఫిర్యాదుపై రాష్ట్ర పోలీసులు తీసుకునే యాక్షన్‌పై ఉత్కంఠ నెలకొంది. రాజాసింగ్‌పై నమోదైన పోలీస్ స్టేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్, కాలా పత్తర్, నాంపల్లి, శాలిబండ, సంతోష్ నగర్, భవానీ నగర్, కామాటిపుర, హబీబ్ నగర్, అంబర్‌పేట్, బోరబొండ, హుస్సేనీ ఆలం, మాదన్నపేట, గోల్కొండ, ఫలక్‌నుమా, అత్తాపూర్, కుల్సుంపుర, పహాడీ షరీఫ్, నాంపల్లి, గుడి మల్కాపూర్, బేగంపేట, తలాబ్ కట్ట, బేగం బజార్, చంద్రాయణగుట్ట, మదనపేట పోలీస్ స్టేషన్ 2వ ఫిర్యాదు, బస్వకళ్యాణ్ కర్ణాటక పోలీస్ స్టేషన్, మలక్‌పేట, తాండూర్, బీదర్ కర్ణాటక, ముషీరాబాద్, బంజారాహిల్స్, బహదూర్‌పుర.. ఇలా మొత్తం 31 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు.



# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంను ఆశ్రయించండి

## ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందన్న కవిత

**హైదరాబాద్, అక్టోబర్ 11 :** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును రేవంత్ సర్కార్ ఆశ్రయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యిందని.. ఇకనైనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లతోపాటు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదం తెలిపి 6 నెలలు గడిచిందని గుర్తు చేశారు. ఈ రెండు బిల్లులు రాష్ట్రపతి వద్దకు చేరినా ఆమోదం పొందలేదని తెలిపారు. ఈ బిల్లుల చట్టబద్ధత కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిన్న ప్రయత్నం కూడా చేయలేదని విమర్శించారు. 2018 పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే సవరణ బిల్లు గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉందని చెప్పారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి వద్ద, చట్ట సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉండగానే రేవంత్ సర్కార్ తెచ్చిన జీవో నం.9 పై హైకోర్టు స్టే విధించిందని పేర్కొన్నారు. ఈరోజు ఉదయం 8.30 గంటల ప్రాంతంలో హైకోర్టు ఉత్తర్వుల కాపీ అందిందని చెప్పారు. అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన బిల్లులను ఆరు నెలలుగా కోల్డ్ స్టోరేజీలో పెట్టిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతిపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేయాలని పేర్కొన్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వం సైతం స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై యోచిస్తోంది. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం అత్యున్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పర్మిషన్ ఇవ్వాలని కోరనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా మొదలైనందున హైకోర్టు జోక్యం సరికాదని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించనుంది.

# తెలంగాణ ఐకానిక్‌గా టీ-స్క్వేర్ నిర్మాణం

మొదటి పేజీ తరువాయి



సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్‌కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక్, టీ-హబ్ ఎండీ వేణుప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నవంబర్ నెల చివరికల్లా ఏ-హబ్ పనులు ప్రారంభం కావాలని అధికారులను రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏ-హబ్ నిర్మాణం కోసం జైకా ఫండ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ-హబ్ నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ఏ-హబ్‌లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. యుటిలిటీ జోన్ ఏర్పాటు చేయడంతో పాటు ఏ-హబ్ 24 గంటలపాటు పని చేయాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలలో భవనాలను పరిశీలించాలని ఆదేశించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

# వరంగల్ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటి?

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు
- కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ



**వరంగల్, అక్టోబర్ 11 :** మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వరంగల్ రాజకీయాలతోపాటు దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుంటున్నట్లు కొండా దంపతులు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి ఫోన్ చేసిన కొండా మురళి ఆయనకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. ఆయన వల్ల జిల్లాలో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లా రాజకీయాలను ఖర్గేకి వివరించారు. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని కొండా దంపతులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి.. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

మొదటి పేజీ తరువాయి

ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ల దగ్గర మాట్లాడతాడనుకున్నాం. వాళ్ల పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా, రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుతుందని కనీసమైనా బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కలిసి ఉన్నా, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక్క ఫోన్ కూడా చేయలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పనిగా కాకుండా, తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీశ్ రావు సూచించారు. "ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే, నేను వదులుతా 112 టీఎంసీలు ఆపుకుంటా" అని కర్ణాటక అంటోంది. "నేను 74 టీఎంసీలు ఆపుకుంటా" అని మహారాష్ట్ర అంటోంది. కర్ణాటక 112 టీఎంసీలు, మహారాష్ట్ర 74 టీఎంసీలు ఆపితే మన పరిస్థితి ఏంటి? మాట్లాడతే 'నల్లమల బిడ్డ' అంటాడు. ఆ నల్లమలల్ని అల్లుకుంటూ పారే కృష్ణా నదిలో మాహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరుగుతుంటే ఎందుకు మాట్లాడటం లేదు? నువ్వు నల్లమల పులివా? పిల్లివా? ఎలుకవా? ఎందుకు మాట్లాడటం లేదు? పులి అయితే మాట్లాడేవాడివి... పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదని హరీశ్ రావు ఘాటుగా విమర్శించారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారినా..

# వరి సాగులో రికార్డు

మొదటి పేజీ తరువాయి



మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదని మంత్రి వివరించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాలను ఆంధ్రకు అప్ప జెప్పారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా నీటిని తాము కాపాడుకుంటామని తెలిపారు. తప్పుడు మాటల ద్వారా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారంటూ హరీశ్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని వ్యంగ్యంగా అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ తుమ్మిడిహెట్టి వద్ద త్తటెడు మట్టి ఎత్త లేదని విమర్శించారు. గోదావరి జలాల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడిన మాటలలో వాస్తవాలు ఏమి లేవని.. ఈ తరహా ప్రచారాన్ని మానుకోవా లంటూ ఆయనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల కెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవు తాయన్నారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందంటే అది భారత రాష్ట్ర సమితి పాలనలోనే. కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీ ప్రభుత్వం తీసుకోవచ్చని, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమే. మన నీటి హక్కులు కాపాడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తున్నాం. నీటి వాటాల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే. గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఇదే విషయాన్ని గతంలో అనేక సార్లు చెప్పాం. కర్ణాటకలో అల్మట్టి డ్యాం ఎత్తు పెంపును కూడా వ్యతిరేకిస్తున్నాం. కృష్ణా జలాల్లో 70 శాతం తెలంగాణకే కేటాయించాలని మేం వాదనలు వినిపిస్తున్నాం. పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే నిర్మించింది. అది కూడా మూడేళ్లకే కూలిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. అవాస్తవాలు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెలే, మాజీ మంత్రి టి. హరీశ్ రావుకు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అబద్దాలను ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదంటూ హరీశ్ రావుకు ఆయన హితవు పలికారు. బనకచర్లపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంతేకాదు.. బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీ వ్యతిరేకమని తాము మొదటి నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు.

# 14న బిసి కులాల బంద్

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.



# తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు

మొదటి పేజీ తరువాయి

ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో.. సోమవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, , జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# జూబ్లీహిల్స్ కోసం బీఆర్ఎస్ వార్ రూమ్

## పార్టీ నేతలతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్



**హైదరాబాద్,అక్టోబర్ 11 :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ప్రతిపక్ష బీఆర్ఎస్ సీరియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా శనివారం ఉప ఎన్నిక ఇంఛార్జ్‌లతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంపై ఇంచార్జ్‌లకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. మరోవైపు బై ఎలక్షన్ కోసం వార్ రూం ఏర్పాటు చేస్తోంది బీఆర్ఎస్. వార్ నుంచే ఉప ఎన్నిక కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ఎన్నిక ప్రచారం, సభలు, ర్యాలీలకు బీఆర్ఎస్ సిద్ధం చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ర్యాలీలు నిర్వహించను న్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ముందుకు వెళ్తోంది. కాగా.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్‌లో మరోసారి గులాబీ పార్టీ జెండా ఎగువేయాలనే లక్ష్యంతో ఉంది బీఆర్ఎస్. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత పేరును ప్రకటించింది ఆ పార్టీ. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద సవాల్ అనే చెప్పుకోవాలి. ఇప్పటికే ప్రచారాన్ని కూడా నిర్వహిస్తోంది. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది.నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగనుంది. నవంబర్ 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈనెల (అక్టోబర్) 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. అక్టోబర్ 21 నామినేషన్ దాఖలుకు చివరి తేదీ. అలాగే ఈనెల 22న నామినేషన్ల పరిశీలన జరుగనుంది.



# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్న తెలంగాణ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

తెలుస్తోంది. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతించాలని కోరనుంది. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించనుంది. జీవో 9ను అమలు చేయాలని కోరనుంది. సుప్రీంకోర్టుకు వెళ్లే అంశంపై కాంగ్రెస్ నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో మాట్లాడారు.

# హైకోర్టు స్టేకు సుప్రీంకోర్టులో సవాల్

- 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయం
- పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సీఎం రేవంత్



**హైదరాబాద్, అక్టోబర్ 11 :** బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9పై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో, రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పును స్టడీ చేసిన ప్రభుత్వం, సీనియర్ కౌన్సిల్స్‌తో సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింఘ్వి తో పాటు సిద్ధార్థ దవే వంటి రిజర్వేషన్లపై ప్రావీణ్యం ఉన్న అడ్వకేట్లతో వాదనలు వినిపించాలన్నదే ప్రభుత్వం ఆలోచన. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తదితరులు జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9పై స్టే ఇచ్చిన అంశంపై తదుపరి చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. జీవో 9ను అమలు చేసేందుకు సుప్రీంకోర్టు తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ అన్నారు.

మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించా లన్న లక్ష్యంతో ముందుకెళ్తోంది. బీసీలకు రిజర్వేషన్లు తేలిపోయే వరకు స్థానిక ఎన్నికలు నిర్వహించబోమని ఇప్పటికే మంత్రులు పేర్కొన్నారు. మరోవైపు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాత పద్ధతిలో ం అంటే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించవచ్చని హైకోర్టు తెలిపింది. జీవో 9పై మాత్రమే స్టే ఇచ్చిందని, రిజర్వేషన్ల విషయంలో క్లారిటీ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు, వచ్చే వారం క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా, హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తాజాగా బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఆర్డర్ కాపీ వెలువడింది. జీవో 9, 41, 42లపై హైకోర్టు స్టే విధిం చింది. ట్రిపుల్ టెస్ట్‌ను పాటించకపోవడంపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వే షన్లు మించడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణను డిసెంబర్ 3కు వాయిదా వేసింది. వికాస్ కృష్టా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకుంది.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి : చిన్నారెడ్డి



**హైదరాబాద్:** ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన లేఖ రాశారు. "రాష్ట్రంలో వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, వారిని ప్రైవేటు ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రైవేటు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వడం లేదు. సుమారు 20శాతం వరకు వేతనాల్లో కోత విధించడంతో పాటు.. జీతాలు కూడా ఆలస్యంగా ఇస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల కేబినెట్ తీర్మానం చేసింది. తెలంగాణలో కూడా అదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి" అని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో చిన్నారెడ్డి వివరించారు.

## గాంధీపై అనుచిత వ్యాఖ్యలు

### నటుడు శ్రీకాంత్‌పై ఎమ్మెల్సీ ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు 11 :** జాతిపిత మహాత్మాగాంధీపై సినీ నటుడు శ్రీకాంత్ భరత్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్ భరత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ శనివారం బషీర్ బాగ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బల్మూర్ వెంకట్ మీడియాతో మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీకాంత్ భరత్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాక్ స్వాతంత్రం పేరిట హద్దులు మీరి కొంతమంది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. శ్రీకాంత్ భరత్ వ్యాఖ్యలపై సినీ ఇండస్ట్రీ పెద్దలు స్పందించాలని కోరారు. త్వరలో మా అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు మంచుని కలిసి శ్రీకాంత్ భరత్ సభ్యత్వం రద్దు చేయాలని కోరుతామని పేర్కొన్నారు.

## ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై సిఎం దిగ్భ్రాంతి

### కుల దురహంకారానికి నిదర్శనమన్న రేవంత్

**హైదరాబాద్, అక్టోబరు 11 :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్యానా కేడర్ ఐపీఎస్ అధికారి, ఏడీజీపీ వై పూరన్ సింగ్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కులం కారణంగా బలవంతంగా ఆత్మహత్య చేసుకున్న ఘటనకు ఈ ఐపీఎస్ అధికారి మృతి ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అడిషనల్ డీజీపీ స్థాయి అధికారిని కులం పేరుతో వేధించడం చూస్తే.. సామాన్య ప్రజల దయనీ య జీవన పరిస్థితులను అర్థం చేసుకో వచ్చునన్నారు. ఇలాంటి అసహనకర సంఘటన చోటు చేసుకోవడం తీవ్ర ఆందోళనకరమని విచారం వ్యక్తం చేశారు. అణచివేతకు గురైన వర్గాల పట్ల చూపిస్తున్న ద్వేషం.. సమాజాన్ని విషపూరితం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా అవమానకర సంఘటనల వల్ల రాజ్యాంగం, సమానత్వంతోపాటు న్యాయంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోం దన్నారు.
అణగారిన వర్గాలపై ఈ తరహా దాడులను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలంటూ ఈ సందర్భంగా ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇది ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఘటనపై దేశంతోపాటు ప్రజలంతా ఆలోచించాలన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## అధిక వడ్డీల పేరుతో 50కోట్ల మోసం

### తప్పించుకు తిరుగుతున్న మోసగాడి అరెస్ట్

**నల్గొండ, అక్టోబరు 11 :** అధిక వడ్డీ పేరుతో రూ.50 కోట్ల మేర మోసానికి పాల్పడిన నిందితుడిని నల్గొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు విలువైన కార్లు, ఆస్తి పత్రాలు, బాధితులకు ఇచ్చిన ప్రామిసరీ నోట్లు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేయడంతో పరారీలో ఉన్నాడు. పోలీసులు రంగంలోకి దిగా అతడిని పట్టుకున్నారు. కేసు వివరాలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ మీడియాకు వెల్లడించారు. పీఏ పల్లి మండలం, వద్దిపట్ల గ్రామానికి చెందిన రమావత్ బాలాజీ 2020లో ఐస్‌క్రీమ్ పార్లర్ వ్యాపారం ప్రారంభిస్తానని చెప్పి.. బంధువుల వద్ద రూ.5 లక్షలు రూ.2ల వడ్డీకి తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టపోయి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం వైపు అడుగులు వేశాడు. రూ.6 వడ్డీ చొప్పున అదే గ్రామానికి చెందిన వారి దగ్గర నుంచి రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సకాలంలో వడ్డీ చెల్లిస్తూ నమ్మకం కలిగించాడు. మరికొంత మంది ఏజెంట్లను నియమించుకొని.. చుట్టుపక్కల గిరిజన తండాల్లో అధిక వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బుతో బంధువులు, స్నేహితుల పేరిట వ్యవసాయ భూములు, ఇళ్లు, ఖరీదైన కార్లు, బైక్‌లు కొనుగోలు చేసి జల్సాలు చేసేవాడు. ఇంకా అధిక డబ్బులు వసూలు చేసే ఉద్దేశంతో నెలకు రూ.10 వడ్డీ ఇస్తానని జనాలను నమ్మించి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసి.. వడ్డీ మాత్రమే ఇచ్చి బాధితుల వద్ద ఉన్న ప్రామిసరీ నోటు వెనుక వడ్డీ ఇచ్చినట్లు రాసి ఇచ్చేవాడు. బ్యాంక్‌లో వచ్చే వడ్డీ కంటే పది రేట్లు ఎక్కువ వడ్డీ ఇవ్వడంతో జనాలు ఆకర్షితులై బాలాజీ నాయక్‌కి అధికమొత్తంలో డబ్బులు ఇచ్చారు. గత కొన్ని నెలలుగా బాధితులకు అసలు, వడ్డీ డబ్బులు ఇవ్వలేక పోయే సరికి.. వారంతా అతడిపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో వారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. తాజాగా నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. రిమాండ్‌కి తరలించారు.

## బీహార్‌లో వంద సీట్లలో పోటీ చేస్తాం

### ఎంఐఎం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్

**పాట్నా, అక్టోబరు 11 :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకు 'ఇండియా' కూటమి ఎటూతేల్చి చెప్పకపోవడంతో అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఎంఐ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో బిహార్‌లో 20 సీట్లలోపే పోటీ చేస్తూ వచ్చిన ఆ పార్టీ ఇప్పుడు 100 సీట్లలో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. బిజేపీ సారథ్యంలోని ఎన్డీయే, కాంగ్రెస్–ఆర్జేడీ కూటములకు ప్రత్యామ్నాయంగా తృతీయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు తాము సిద్ధమవుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్ తెలిపారు. పొత్తుల కోసం లాలూ ప్రసాద్ యాదవ్ (ఆర్జేడీ అధ్యక్షుడు), తేజస్వి యాదవ్‌కు తాము లేఖ రాశామని, అయితే ఎలాంటి స్పందన రాలేదని అఖ్తరుల్ తెలిపారు. దీంతో తమ పార్టీ ఉనికికి మరింత విస్తరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, భావసారూప్యత కలిగిన పార్టీలతో తృతీయ ఫ్రంట్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని, మరికొద్ది రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఐఎంఐఎం 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయవతి బీఎస్పీ, ప్రస్తుతం రద్దయిన లోక్ సమతా పార్టీ (ఉపేంద్ర కుష్వాహ)తో పొత్తు పెట్టుకుంది. ఏఐఎంఐఎం 5 సీట్లు గెలుచుకుంది. పలుచోట్ల ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష కూటమి విజయావకాశాలను దెబ్బతీసింది. అయితే 2022లో నలుగురు ఏఐఎంఐఎం ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరారు. బిహార్‌లోని పరివాహక ప్రాంతంలో 17 శాతం ముస్లిం జనాభా ఉండటంతో ఆ ప్రాంతంపై ఏఐఎంఐఎం కన్నేసిందని, ఇందుకోసమే ఒవైసీ గత నెలలో సీమాంచల్ ప్రాంతంలో నాలుగు రోజుల పాటు పర్యాటించారని విశ్లేషకులు చెబుతున్నారు. కిషన్ గంజ్, అరియాలో, కతిహార్, పూర్ణియాలో గణనీయంగా ముస్లిం జనాభా ఉండటంతో ఒవైసీ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కాగా, ఆర్జేడీ, జేడీయూ, కాంగ్రెస్ అవకాశాలకు ఏఐఎంఐఎం గండికొడుతోందని, బీజేపీకి బీ టీమ్‌గా వ్యవహరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎంఐఎం ఈసారి 100 సీట్లలో పోటీకి సన్నాహాలు చేయనుండటం ప్రాధాన్యత సంతరించుంటోంది. 243 మంది సభ్యుల బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా నవంబర్ 6,11 తేదీల్లో పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

## 9 రోజులు నో ఈమెయిల్స్.. ఓన్లీ రెస్ట్

### ఆ ఉద్యోగులకు దీపావళి ఆఫర్



**ఢిల్లీ :** కంపెనీ వృద్ధికోసం డెడ్‌లైన్స్, టార్గెట్స్ పెట్టుకొని పనిచేసే ఉద్యోగులు.. ఆ క్రమంలో ఒత్తిడికి గురవుతుంటారు. తరచూ అలా అలసిపోవడం వల్ల ఉత్పాదకతపై ప్రభావం పడుతుందని నిపుణులు హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న రియల్‌ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్, దిల్లీకి చెందిన పీర్ సంస్థ ఎలైట్ మార్క్ తమ సిబ్బంది మానసిక ఆరోగ్యం కోసం కీలక నిర్ణయం తీసుకున్నాయి. అక్టోబర్ 18–26 వరకు తొమ్మిది రోజుల సెలవుల రూపంలో దీపావళి గిఫ్ట్ ఇచ్చాయి. "ఎప్పుడూ కంపెనీ పనిలో నిమగ్నమై ఉండే పరిస్థితుల్లో.. పాజ్, బ్రేక్, రీకనెక్ట్ చాలా ముఖ్యం. ఇలాంటి పండగ బ్రేక్‌లు అందుకు దోహదం చేస్తాయి. మా వృద్ధికి పాటుపడే వ్యక్తులకు మేం విలువనిస్తాం" అని ఎంబసీ గ్రూప్‌నకు చెందిన చీఫ్ హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్ మారియా రాజేశ్ అన్నారు. ఈ హాలిడేస్‌లో దీపావళి వేడుకలు నిర్వహించి, కానుకలు ఇస్తుంటుంది. అంతేగాకుండా ఉద్యోగులకు మానసిక ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటోంది. అందుకోసం 'వెల్‌బీయింగ్ ఆన్ ద వెబ్' అనే ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఎలైట్ మార్క్ సీఈఓ రజత్ గ్రోవర్ ఉద్యోగులకు ఈమెయిల్ పంపి, సెలవుల గురించి వెల్లడించారు . కంపెనీ మెయిల్స్‌కు దూరంగా ఉండి, రెస్ట్ తీసుకుంటూ కుటుంబంతో సంతోషంగా గడపాలని సూచించారు. ఏమాత్రం ఊహించని గిఫ్ట్ అందేసరికి ఆ సంస్థకు చెందిన ఉద్యోగి ఒకరు లింక్డిన్ ద్వారా తన సంతోషాన్ని వ్యక్తంచేశారు. సిబ్బంది శ్రేయస్సుకు విలువనిచ్చే సంస్థలో పనిచేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి బ్రేక్‌లు ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు సృజనాత్మక ఆలోచనను పెంపొందిస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. అలాగే కొత్త ఉత్సాహంతో పనిమీద దృష్టిపెట్టేందుకు సహకరిస్తాయని వెల్లడించాయి. ఇదిలాఉంటే.. ప్రముఖ ఈ కామర్స్ సంస్థ మీషో ఉద్యోగులకు ఇలా వరుసగా సెలవులు ఇచ్చి వార్తల్లో నిలిచింది. "మా మెగా బ్లాక్‌బస్టర్ సేల్ తర్వాత.. పూర్తిగా విశ్రాంతి తీసుకొని, మాపై మేం దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చింది. సెలవుల అనంతరం సరికొత్త శక్తితో వస్తాం" అని బ్రేక్‌లు ఇస్తుంటుంది. ఈ సంస్థల నిర్ణయాలను నెటిజన్లు మెచ్చుకుంటున్నారు. ఈ విధానం ఎంతో సంతోషాన్నిస్తోందంటూ ప్రశంసించారు. సిబ్బంది మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంత విలువ ఇస్తున్నారో దీనిని బట్టి తెలుస్తోందని మరికొందరు కామెంట్లు పెట్టారు.

## బహిర్భూమికి వెళ్లి బావిలో పడ్డ చిన్నారుల మృతి

**మహబుబాబాద్, అక్టోబరు 11 :** జిల్లాలోని కొత్తగూడ మండలం ఎంచగూడెంలో విషాదం చోటుచేసుకుంది. దసరా పండుగ కోసమని ఇటీవలే ఎంచగూడెం గ్రామానికి ఇటికాల నర్సయ్య, స్వాతి దంపతుల కుమారుడు రితిక్, నర్సయ్య సోదరి అనిత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు జతిన్ అమ్మమ్మ ఇంటికి వచ్చారు. అయితే వీరి బంధువు ఒకరు చనిపోవడంతో.. కుటుంబ సభ్యులందరూ వేరే గ్రామానికి వెళ్లారు. ఇంటి వద్ద ఉన్న రితిక్, జతిన్ కలిసి.. గ్రామ శివార్లలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు బహిర్భుమికి వెళ్లారు. ఇద్దరు కూడా ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోయారు. బావిలో తేలియాడుతున్న పిల్లలను చూసి స్థానికులు అప్రమత్తమయ్యారు. పోలీసులకు సమాచారం అందించారు. కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ తన బృందంతో ఘటనాస్థలానికి చేరుకుని రితిక్, జతిన్ మృతదేహాలను బావిలో నుంచి బయటకు తీశారు. ఇద్దరు పిల్లలు చనిపోవడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## గంజాయి ధ్వంసంతో తండావాసులు దాడి

**సంగారెడ్డి, అక్టోబరు 11 :** సంగారెడ్డి జిల్లాలోని చల్లగిద్దా తండాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గంజాయి మొక్కలను ధ్వంసం చేశారని పోలీసులపై తండా వాసులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. చల్లగిద్దా తండాలో గంజాయి సాగు చేస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇవాళ ఉదయం తండాకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి చేనులో గంజాయి మొక్కలు కనిపించగా, వాటిని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై తండా వాసులు దాడికి దిగారు. రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. అంతటితో ఆగకుండా పోలీసుల సెల్‌ఫోన్లను తండా వాసులు లాక్కున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



## నా తలరాత ఏంటో నాకు తెలుసు : డీకే వ్యాఖ్యలు

**కర్ణాటక :** కర్ణాటకలో కొంతకాలంగా సీఎం మార్పుపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో ముఖ్యమంత్రి మార్పు ఉండొచ్చన్న కథనాలపై శనివారం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. తనకేం తొందరలేదని, తన తలరాత ఏంటో తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని అసంతృప్తి వ్యక్తంచేశారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటినుంచి ప్రచారం జరుగుతోంది. దీనిపై డీకే గతంలోనూ స్పందిస్తూ.. అన్నింటికి కాలమే సమాధానం చెప్తుందని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలనే ఆశ తనకు ఉందనేలా పరోక్షంగా బదులిచ్చారు. కర్ణాటక ప్రభుత్వంలో ప్రస్తుతం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న 50 శాతం మంది మంత్రులను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇస్తారన్న కథనాలు వినిపిస్తున్నాయి. నవంబర్‌లో ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సీఎం సిద్ధరామయ్య యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం ఛేంజ్ గురించి మరోసారి వార్తలు వచ్చాయి.

## బిజెపి నుంచి బరిలోకి దిగుతా

### భోజ్‌పురి గాయని మైథిలి ప్రకటన



**పాట్నా, అక్టోబరు 11 :** బిహార్ జానపదంలో భోజ్‌పురీ పాటలు పెట్టింది పేరు. అక్కడి ప్రజల్లోనూ వీటికి విపరీతమైన క్రేజ్ ఉంటుంది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు భోజ్‌పురి గాయకులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అన్ని పార్టీలూ వీరిని రంగంలోకి దించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. భాజపా నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకుర్ (25) ఇప్పటికే వెల్లడించారు. భాజపా సీనియర్ నేతలు వినోద్ తావ్డే, కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్‌లతో భేటీ అనంతరం ఈ యువ గాయని మీడియాతో మాట్లాడారు. ఇది తనకు భిన్నమైన ప్రయాణమని.. ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మరో ప్రముఖ గాయని శిల్పి రాజ్ కూడా కేంద్ర మంత్రి, రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) చీఫ్ చిరాగ్ పాసవాన్‌తో భేటీ అయ్యారు. దీంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేయొచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్ సురాజ్ పార్టీ కూడా భోజ్‌పురీ గాయకుడు రితేష్ రంజన్ పాండేను కర్గహర్ స్థానం అభ్యర్థిగా ప్రకటించింది. తాను ఈ నేలలోనే పుట్టి పెరిగానని, కళాకారుడిగా ఇక్కడ తరచూ పర్యటిస్తుంటానని చెప్పారు. ఎన్నికల్లో స్థానిక ప్రజల మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాపులర్ భోజ్‌పురీ గాయకుడు అలోక్ కుమార్ కూడా ఇటీవలే జన్ సురాజ్‌లో చేరారు. ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని, రాష్ట్రంపై ప్రశాంత్ కిశోర్‌కు ఉన్న దార్శనికత కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే మాత్రం.. ఆలోచిస్తానని చెప్పారు. భోజ్‌పురీ సూపర్‌స్టార్ పవన్ సింగ్.. గత లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి భాజపా తరఫున భోజ్‌పుర్ జిల్లాలోని ఏదైనా ఒకస్థానం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది.

## రాహుల్ గాంధీ మాదిరే.. తేజస్వీ ఓడిపోతారు : ప్రశాంత్ కిశోర్



**బిహార్ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లో ప్రచారం జోరందుకుంటోంది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సొంత నియోజకవర్గమైన రాఘోపుర్ నుంచి జన్‌సురాజ్ పార్టీ తన ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే తేజస్వీపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విమర్శలు ఎక్కుపెట్టారు. గతంలో అమేఠీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓడిపోయినట్లు.. ఇప్పుడు రాఘోపుర్‌లో తేజస్వీ యాదవ్ పరాజయం పాలవుతారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేయనున్నారా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. ఈ నిర్ణయం పార్టీ చేతుల్లో ఉందన్నారు. "రాఘోపుర్‌లో కుటుంబ ఆధిపత్యానికి తెరదించాలని ఓటర్లు కోరుకుంటున్నారు. తేజస్వీకి ముందు ఆయన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. అయినప్పటికీ.. ఈ నియోజకవర్గంలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి" అని ప్రశాంత్ కిశోర్ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో తేజస్వీ రెండుచోట్ల పోటీ చేయనున్నారనే వాదనలపై స్పందిస్తూ.. "ఆయన్ను అలాగే పోటీ చేయనివ్వండి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు స్థానాల్లో బరిలోకి దిగారు. అమేఠీలో ఓడిపోయారు. తేజస్వీ యాదవ్‌కు ఇప్పుడు రాఘోపుర్‌లో అదే విధమైన ఫలితం వస్తుంది" అని వ్యాఖ్యానించారు. బిహార్‌లో వచ్చే నెల 6, 11వ తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జన్‌సురాజ్ పార్టీ తరఫున 51 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ఇటీవల విడుదల చేశారు. తాను పోటీ చేస్తానా? లేదా అనే విషయాన్ని ప్రశాంత్ కిశోర్ ఇంకా వెల్లడించలేదు. "ఆదివారం పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఉంది. రాఘోపుర్ నుంచి ఎవరూ పోటీ చేయాలనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అది నేనే అవుతానో లేదో చెప్పలేను. ఈ నిర్ణయం పార్టీ తీసుకుంటుంది" అని చెప్పారు.

# చేపలను మింగుతున్న కాలుష్యం!



పరిశ్రమల కాలుష్యం నదులను, చెరువులను, చివరకు సముద్రాన్ని కూడా కలుషితం చేస్తోంది. మన జీవితాలు ఏమయితేనేమి అన్న ధోరణిలో పరిశ్రమల యజమానులు కాలుష్యాన్ని విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. ఒకప్పుడు పటాన్ చెరువు కాలుష్యంపే ఏళ్లుగా పోరాటాలు జరిగాయి. తరవాత ఎల్‌బినగర్ సిరిస్ కంపెనీ కాలుష్యంపైనా పోరాటాలు సాగాయి. హుస్సేన్ సాగర్ కాలుష్యం అలాగే ఉండిపోయింది. కొబ్బరినీళ్లలా హుస్సేన్ సాగర్ నీళ్లను చేస్తానన్న కెసిఆర్ కూడా పట్టించుకోలేదు. ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరించినా అడుగులు పడడం లేదు. ఇప్పుడు ఉప్పాడ కాలుష్యం పై మత్స్యకారులు పోరాటం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గట్టిగానే స్పందించారు. అయితే ఆయన పట్టుదల ఎంతవరకు అన్నది తేలాల్సి ఉంది. పట్టుదలతో కాలుష్యాన్ని అరికట్టగలిగితే చిరస్థాయిగా నిలిచిపోతారు. సముద్రాన్ని కాపాడుకున్నవారం అవుతాం. అలాగే విశాఖలో సముద్రజలాల కాలుష్యం కూడా ఇంతకుమించి ఉంది. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై కాలుష్య నియతరణ అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట..మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసు కున్నారు. దీనిపై ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఇప్పుడు అందరి దృష్టి ఉంది. నిజానికి ఉప్పాడ తీరంలో ఉంటున్న వారంతా సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులు. ఏళ్ల తరబడి వేటే ఆధారంగా జీవిస్తున్నారు. వీరి ఉపాధికి ఫార్మా కంపెనీలు గండి కొడుతున్నాయి. ఈ పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో చేపల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది.

కాకినాడ జిల్లా కెఎస్‌ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. అరబిందో పరిశ్రమ నుంచి కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమల కాలుష్యంపై వైసిపి హయాం నుంచీ పోరాటం చేస్తున్నారు.. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలని కోరుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి తొండంగి మండలం అద్దారిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల వ్యర్థాల వల్ల చేపలు చనిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల నుంచి చేపల ఉత్పత్తి తగ్గిపోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నబోటుపై వేటకు వెళ్తే రోజుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల విలువైన మత్స్య సంపద దొరికేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు.

ఒక్కసారి వేటకు వెళ్తే చిన్నబోటుకు రూ.2 వేలు, పెద్ద బోటుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకూ ఆయిల్‌కు ఖర్చవుతుందని తెలిపారు. పెద్ద బోట్లలో 12 మంది వరకూ వేటకు వెళ్తారని, 15 రోజుల వరకూ సముద్రం లోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఆయిల్, ఐస్, ఇతర నిర్వహణకు మొత్తంగా రూ.1.50 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. ఖర్చులుపోనూ గతంలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరేదని, ప్రస్తుతం చేపలు దొరక్కపోవడంతో ఖర్చులు కూడా రావట్లేదని ఉప్పాడ మత్స్యకారులు తెలిపారు.గత జగన్ ప్రభుత్వ హయాం నుంచి ఈ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు ఆందోళనలు సాగిస్తున్నారు. మత్స్యకారులు గతేడాది ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బీచ్ రోడ్డుని పూర్తిగా నిర్బంధించి పది రోజులపాటు నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల కోడ్‌తో ఆందోళన విరమించారు. ఎన్నికల సమయంలో ఉప్పాడలో నిర్వహించిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడారు. కాలుష్య పరిశ్రమలను నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఆయన డిప్యూటీ సిఎం అయినప్పటికీ హామీ అమలు కాలేదు. దీంతో, మత్స్యకారులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. వేల సంఖ్యలో ఉప్పాడ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ స్పందించి ఇటీవలే వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి వంద రోజుల సమయం కావాలని కోరారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ఎంతవరకు అమలవుతుందో చూడాలి. అయితే వెంటనే అధికారులతో సమస్యపై చర్చించడంతో కొంత ఆశ చిగురిస్తోంది.

### గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే
## బనకచర్ల జీవోలు
### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



**నిజామాబాద్:** బనకచర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణం గానే బనకచర్ల జీవోలు వెలువడ్డాయన్నారు. రాయల సీమను రత్నాల సీమ చేస్తానన్నది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. నిజామాబాద్ లో మీడియాతో మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడారు. “జగన్‌తో కేసీఆర్ చెట్టాపట్టాలు వేసుకుని విందులు, వినోదాలు చేసుకున్నారు. ప్రజల హక్కుల విషయంలో మాత్రం మౌనం వహించా రు. బనకచర్ల విషయంలో ఒక చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదు. బనకచర్లపై మంత్రులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ల తో వివరించే ప్రయత్నం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కట్టుబడి అమలు చేస్తాం. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే యోచనలో ఉన్నాం. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్తాం ” అని ఆయన స్పష్టం చేశారు.

## వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో టీషర్టుల ఉత్పత్తిపై కేటీఆర్ హర్షం



**హైదరాబాద్, అక్టోబర్ 11 :** వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తిపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2023లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 11 యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు భూమిపూజ చేశామన్నారు. అన్ని యూనిట్లు ప్రారంభమైతే.. వరంగల్ ప్రధాన వస్త్ర కేంద్రంగా మారుతుందని వివరించారు. ‘వ్యవసాయం నుంచి ఫ్యాషన్’ నినాదంతో టెక్స్‌టైల్ పార్కును స్థాపించినట్లు కేటీఆర్ చెప్పారు.

# కరూర్ తొక్కిసలాట ఘటన
## భారీ భద్రత నడుమ బాధితులను కలవనున్న విజయ్



**కరూర్, అక్టోబర్ 11 :** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో విజయ్ భారీ భద్రత నడుమ బాధిత కుటుంబాలను కలవనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నా యి. బాధిత కుటుంబాలను వారి ఇళ్ల వద్ద కాకుండా..ఓ ప్రత్యేక వేదికలో ఈ నెల 17న పరామర్శించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే వేదికకు సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడించలేదు. విజయ్ బాధితులను కలిసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేయాలని టీవీకే పార్టీ విజ్ఞప్తి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ధ్రువీకరించారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో మాత్రమే మీడియాను అనుమతిస్తామని తెలిపారు. తిరుచ్చి విమానాశ్రయం నుంచి కరూర్‌లోని సమావేశ వేదిక వద్దకు విజయ్ చేరుకునే వరకు దారిలో ఎక్కడా జనం గుమిగూడకుండా విమానాశ్రయ, ట్రాఫిక్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. కరూర్‌లోని వేదిక నుంచి ఒక కిలోమీటరు మేర ప్రజలెవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ వర్గాలు కోరినట్లు తెలిపారు. కేవలం బాధిత కుటుంబసభ్యులకు మాత్రమే వేదిక వద్దకు ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.

## నవ్వాడని నరికేశాడు..
### రేణిగుంటలో బాలుడి దారుణ హత్య

**తిరుపతి, అక్టోబర్ 11 :** భార్య వదిలేసి వెళ్లిపోవడంతో అందరూ తనను చూసి నవ్వుతున్నారని తీవ్ర అవమానంతో రగిలిపోతున్న వ్యక్తి చేతిలో బాలుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి జిల్లా రేణిగుంట సంత సమీపంలోని గువ్వల కాలనీకి చెందిన పూసలు విక్రయించుకునే మేస్త్రీ భార్య ఇటీవల అతడిని విడిచిపెట్టి వెళ్లిపోయింది. ఈ క్రమంలో అంతా తనను చూసి నవ్వుతున్నారని అతడు అనుమానించేవాడు. బుధవారం అదే ప్రాంతానికి చెందిన శ్రీహరి(17) అనే బాలుడు తనను హేళనగా చూస్తూ నవ్వాడని భావించి కొట్టాడు. ఆ విషయం తెలిసి ఆ బాలుడి తండ్రి కుమారుడిని తీసుకుని గురువారం ఉదయం అతడి వద్దకు వెళ్లి ప్రశ్నించాడు. తండ్రి వెళ్లిపోయిన కొద్దిసేపటికే బాలుడు, అతడు మళ్లీ ఘర్షణ పడ్డారు. తీవ్ర ఆగ్రహానికి గురైన మేస్త్రీ పూసల ధారాలు కోసే పదునైన కత్తితో బాలుడి మెడపై నరకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందాడు.



## విద్యార్థినిపై అత్యాచారం
### బెంగాల్‌లో మరో దారుణం

**పశ్చిమబెంగాల్ :** పశ్చిమబెంగాల్‌లో వరుస అత్యాచార ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల కోల్‌కతాలో ఆర్జీకర్ వైద్యురాలితో పాటు మరో న్యాయవిద్యార్థినిపైనా అత్యాచారం జరగడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చెలరేగిన సంగతి తెలిసిందే. తాజాగా మరో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరగడం ఆందోళన రేకెత్తిస్తుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన యువతి(23) దుర్గాపుర్‌లోని శోభాపుర్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. శుక్రవారం రాత్రి భోజనం చేసేందుకు తన ఫ్రెండ్‌తో కలిసి కాలేజీ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లింది. ఈ క్రమంలో కొందరు దుండగులు వీరిని వెంబడించారు. దీంతో యువతి ఫ్రెండ్ భయపడి పారిపోగా.. దుండగులు బాధితురాలిని సమీపంలోని అడవిలోకి లాక్కెళ్లారు. అక్కడ వారిలో ఒకడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సమాచారం అందగానే ఘటనా స్థలానికి వెళ్లి బాధితురాలిని ఆస్పత్రికి తరలించామన్నారు. ఇక, ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో పాటు వైద్య కళాశాల సిబ్బంది, యువతి స్నేహితులను కూడా విచారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామన్నారు. ఇటీవల సౌత్ కోల్‌కతాలోని లా కళాశాలలో ఓ న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో అధికార తృణమూల్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనికి ముందు ఆర్జీకర్ వైద్య కళాశాలలో వైద్యురాలిపై చోటుచేసుకున్న అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే.

### రాహుల్ కూడా కోరీనా లాగా
# పోరాడుతున్నారు
### కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ పోస్ట్ వైరల్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 11 :** ప్రస్తుతం ఎవరి నోట విన్నా నోబెల్ శాంతి బహుమతి గురించే చర్చ నడుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ నోబెల్ శాంతి పురస్కారం ఈ ఏడాది వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోను వరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. మరియా కొరీనా తమ దేశంలో రాజ్యాంగ హక్కుల కోసం పోరాడినందుకు ఆమెకు నోబెల్ బహుమతి ఇచ్చారని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ తెలిపారు. అమెలానే ఇప్పుడు మన దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పోరాడుతు న్నారని పేర్కొన్నారు. 'రాజ్యాంగ హక్కుల కోసం పోరాడినందుకు వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలికి ఈ ఏడాది నోబెల్ శాంతి లభించింది. భారత్‌లో రాజ్యాంగాన్ని కాపాడే పోరాటానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్నారు’ అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ఆయనకు కూడా శాంతి పురస్కారం ఇవ్వాలని పరోక్షంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు కొరీనా మచాడో, రాహుల్ ఉన్న ఫొటోలను ట్వీట్‌కు జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది.

# ఆ.. ఆటో డ్రైవర్ కోటీశ్వరుడు
### సోషల్ మీడియా పోస్ట్‌తో షాక్



**బెంగుళూరు, అక్టోబర్ 11 :** సాధారణ ఆటో డ్రైవర్ కోట్లకు పడగలెత్తిన విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒక ఆటో డ్రైవర్ మహా అయితే రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తుంటాడు. ఇక కొన్నిసార్లు ప్యాసింజర్లు లేకపోతే ఆటోవాలా పరిస్థితి అంతంతే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో రోజంతా కష్టపడుతూ కుటుంబాన్ని అతికష్టం మీద పోషిస్తుంటారు. ట్రాఫిక్‌లో నానా అవస్థలు పడుతూ, ప్యాసింజర్ల కోసం ఆరాటపడడడంలోనే రోజంతా గడిచిపోతుంది. ఇంటి ఖర్చులు, అప్పులు పోనూ చేతికి మిగిలేది అంతంతే. ఇక తెలుగు రాష్ట్రాల్లో అయితే చెప్పనక్కర్లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఆటో నడుపుకునే వారి పరిస్థితి మరింత దిగజారింది. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి ఎన్నో సార్లు మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉంటే.. ఆటోలో ప్రయాణిస్తున్న ఓ ప్యాసింజర్‌కు వినూత్న అనుభవం ఎదురైంది. కార్పొరేట్ మేనేజర్ కంటే ఎక్కువగా ఆటో డ్రైవర్ డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు. కర్ణాటక రాజధాని బెంగుళూరుకు చెందిన ఆకాష్ ఆనందానీ అనే వ్యక్తి ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పోస్ట్ చూసి షాక్ తింటున్న యూజర్లు షేర్ చేయడంతో అది కాస్త వైరల్‌గా మారింది. ఆఫీస్ పనికోసం వెళ్తున్న ఆకాష్ ఆనందానీ, ఆటోలో బయల్దేరాడు. ఆటోవాలా పక్కన కూర్చొని ఆటో నడుపుతుండగా అతని చేతికున్న యాపిల్ వాచ్, ఎయిర్ పోడ్స్ చూసి ఒక్కసారిగా షాక్ అయ్యాడు. ఆటో డ్రైవర్‌కి యాపిల్ వాచ్ ఏంటని.. పూర్తి విషయాలు తెలుసుకుందామని అతనిని అడిగాడు. ఆటోడ్రైవర్ సమాధానాలు విని ఆ ప్యాసింజర్ ఒక్కసారిగా అవాక్కయ్యాడు. తనకు రూ.4-5 కోట్ల విలువచేసే రెండు ఇళ్లు ఉన్నాయని, వాటిని అద్దెకు ఇస్తే నెలకు రూ.2-3 లక్షల ఆదాయం వస్తుందని ఆటోవాలా చెప్పుకొచ్చాడు. అంతేకాదు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ కంపెనీలో భారీ పెట్టుబడి సైతం పెట్టినట్లు చెప్పాడు. వారం మొత్తం తాను ఆటో నడపనని.. కేవలం వారాంతంలో మాత్రమే తాను ఆటో నడుపుతానని చెప్పుకొచ్చారు. ఆటో డ్రైవర్ చెప్పిన విషయాలకు నివ్వెరపోయిన ఆ ప్యాసింజర్.. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది కాస్త వైరల్ అయింది.



## మరింత పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, అక్టోబర్ 11 :** బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,24,260కు చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ.1,13,900కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 24, 410కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ.1,14,050కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు కిలో వెండి ఏకంగా 3000 రూపాయలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర 1,87,000కు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో వెండి ధర రూ.1,77,000గా ఉంది. ఈ ఏడాది చివరి నాటికి కిలో వెండి ధర రెండు లక్షల రూపాయలకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం సిల్వర్ వేగం చూస్తుంటే అంత సమయం పట్టేలా కనిపించడం లేదు



## యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వివిధ సమస్యల పై ప్రజల అర్జీలు ఇచ్చేందుకు ఈ నెల 13వ తేదీన నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని యధా విధిగా నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి వివిధ సమస్యల పై ఫిర్యాదులు ఇచ్చేందుకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి రావొచ్చని తెలిపారు.



## ఇట్టమల్ల ఏసోబు జీవితం ఆదర్శనీయం

### మాల మహానాడు రాష్ట్ర కమిటీ అధ్యక్షులుతల్లమల్ల హసేన్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చివ్వెంల మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు ఇట్టమల్ల ఏసోబు అకాల మరణం బాధాకరమని వారి మరణం బడుగు బలహీన వర్గాల వారికి తీరనిలోటని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు న్యాయవాది తల్లమల్ల హసేన్ అన్నారు చివ్వెంల మండల కేంద్రంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది ఏడిండ్ల అశోక్ విశ్రాంత తహసిల్దార్ పెరుమళ్ళ రాజారావుతో కలిసి ఏసోబు గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపి ఏసోబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఏసోబు సిపిఎం పార్టీలో క్రమశిక్షణ గల సైనికునిగా పనిచేస్తూ పార్టీ విధానాలకు కట్టుబడి పని చేశారని తాను 1987 సంవత్సరంలో తొలి చివ్వెంల మండల ప్రజా పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికై మండలంలో అన్ని గ్రామాల్లో మరియు మండల కేంద్రంలో అభివృద్ధి పనులు చేశారని ఎలాంటి రాగాద్వేషాలకు లోనవ్వకుండా నిబద్ధతగా పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని పొందినారు.పార్టీలకు అతీతంగా కుల మతాలకు అతీతంగా ప్రజలందరితో సోదర భావంతో ఐక్యమవుతూ వారు చేసిన సేవలు ఎంతో విలువైనవని వారి జీవితం ఆదర్శనీయమని తెలిపారు.




## సుర్దేపల్లి పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌ను

### సస్పెండ్ చేసిన జిల్లా విద్యాధికారిణి శ్రీజ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండలం సుర్ధేపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తూ, ప్రస్తుతం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డిప్యుటేషన్ పై పనిచేయుచున్న టి. లక్ష్మణ్ రావు ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారిణి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. టి. లక్ష్మణ్‌రావు, స్కూల్ అసిస్టెంట్, తన హెడ్‌క్వార్టర్ వదిలి కొణిజర్ల సమీపంలోని క్రాకర్స్ దుకాణానికి వెళ్లి, ఇతరులతో కలిసి వాగ్వివాదం చేయటంతో పాటు, అసభ్యపదజాలంతో దూషించి, సీసీ టివి కెమెరాలను ధ్వంసం చేసిన ఆరోపణలపై, కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయినట్లు జిల్లా విద్యాధికారిణి అన్నారు. తెలంగాణ సివిల్ సర్వీస్ కండక్ట్ రూల్స్‌కు విరుద్ధంగా ప్రవర్తించినందుకు, తన చట్టబద్ధమైన విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, శాఖ ప్రతిష్టను భంగపరిచే చర్యలకై సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో జిల్లా విద్యాధికారిణి పేర్కొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో చదివితే మంచి భవిషత్తు ఉంటుంది : అనిత

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ లో గంగారం ఎంపీపీఎస్. పాఠశాలలో అంగన్ వాడి కేంద్రం ప్రాథమిక పాఠశాలను స్థానిక సోషల్ సర్వీస్ మహిళా నాయకురాలు అనిత సందర్శించి, విద్యార్థుల చదువు తరగతి గదులలోని గోడలమీద ఉన్న చిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివితేనే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మంచి భవిషత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ అనితను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్. భీమమ్మ, నరహరి, విజయలక్ష్మి, ప్రీతి, రాధిక, స్వప్న, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ బీసీల పట్ల ప్రేమలేని

# బిజెపి కేంద్ర ప్రభుత్వం

### అమరవీరుల స్తూపం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వంకు ప్రేమ లేదని వికారాబాద్ జిల్లా సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ మహిపాల్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో అమర వీరుల స్తూపం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ పై ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదన్నారు. రాష్ట్ర గవర్నర్ చేత కూడా ఆమోదం పొందకుండా బిజెపి కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందన్నారు. రాష్ట్రంలో ఉన్న బిజెపి కేంద్ర మంత్రులు ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలి లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వంతో ఒప్పించి 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించలని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం ఇవ్వడానికి సిద్ధంగా కాకపోవడం సిగ్గుచేటన్నరు. ఇప్పటికైనా రాష్ట్ర బిజెపి నాయకత్వం రాష్ట్రం నుండి ఉన్న కేంద్ర బిజెపి మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని ఒప్పించాలని లేకపోతే ఈ రాష్ట్ర బీసీల అందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ని లేకుండా చేస్తే తప్ప 42 శాతం రిజర్వేషన్లు బీసీలు సాధించుకునే పరిస్థితి లేదనేది అర్థమైందని అన్నారు. కచ్చితంగా 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే దిశగా బీసీలు రోడ్ల మీదకు వచ్చి పోరాటం చేయాల్సిన పరిస్థితిని కేంద్ర బిజెపి ప్రభుత్వం కల్పించిందని పోరాటం ద్వారా బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ద్వారా న్యాయపరమైన పద్ధతిలో కూడా బీసీ రిజర్వేషన్లు అమలు అయ్యేటట్లు చూడాలిఅన్నారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు వికారాబాద్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, సతీష్, నవీన్ కుమార్, నాయకులు మహమ్మద్ అక్బర్, గోపాల్, శ్రీనివాస్, మహేందర్, గోపాల్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభ ఏర్పాట్లను

# పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం రానున్నారు. దివంగత మాజీ మంత్రి తుంగతుర్తి, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా సంతాప సభలో సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం పాల్గొననున్నారు. తుంగతుర్తి లోని స్థానిక జాతీయ రహదారి 365 వద్ద గల స్టేడియంలో సంతాప సభ జరగనున్నది. ఈ సందర్భంగా శనివారం సూర్యాపేట ఎస్పి నరసింహ సంతాప సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ మాజీమంత్రి రామ్ రెడ్డి 11వ రోజు పురస్కరించుకొని ఆదివారం సంతాప సభ తుంగతుర్తి హెడ్ క్వార్టర్ లో నిర్వహించనున్నారని ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక శాసనసభ్యులు మందుల సామీలు ఇతర క్యాబినెట్ మినిస్టర్లు రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభకు రానున్నారని ఆయన తెలియజేశారు ఈ సంతాప సభకు అభిమానులు దాదాపు 50 వేల మంది రానున్నారని అంచనా వేస్తున్నామని దానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారని ఎస్పీ తెలియజేశారు. ఈ సంతాప సభకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు నాయకులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించామని తెలియజేశారు. ఆయనతోపాటు దివంగత మాజీ మంత్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట జిల్లా డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, గుడిపాటి నరసయ్య, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి, గుడిపాటి సైదులు, పోతు భాస్కర్, డిఎస్పి ప్రసన్నకుమార్, సిఐ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్, ఆర్డిఓ, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష

- కేసుల దర్యాప్తులో నైపుణ్యం ప్రణాళికతో ముందుకు
- ప్రజల మద్దతుతో ఆధునిక పోలీసింగ్
- ఎవరైనా వ్యక్తులు ప్రజలను ఇబ్బందులు పెట్టిన, దౌర్జన్యాలకు పాల్పడ్డ కఠిన చర్యలు తప్పవు





**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు స్థాయి అధికారులతో ఎస్పీ నరసింహ ఐపిఎస్ సమీక్ష నిర్వహించారు. ప్రజల మద్దతుతోనే ఆధునిక పోలీసులను నిర్వహించగలం అని ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు విభాగం ప్రజలకు వేగవంతమైన నాణ్యమైన, నైపుణ్యంతో కూడిన పారదర్శకమైన పోలీస్ సేవలను అందించడానికి కృతజ్ఞత ఉన్నది అని, దీనిలో భాగంగానే రాష్ట్ర పోలీస్ శాఖ అత్యాధునికమైన సాంకేతికని కలిగి ఉన్నది అని ఎస్పీ తెలిపారు. క్షేత్రస్థాయిలో పోలీసు విధులను ఇన్స్పెక్టర్లు, డిఎస్పీలు నిషిత పర్యవేక్షణ చేస్తేనే ఆధునిక పోలీసింగ్ విజయవంతంగా ముందుకు వెళుతుందని సాంకేతికమైన సేవలను విస్తృతపరచవచ్చు అని తెలిపారు. ఇందుకోసం ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా ముఖ్యం అని పోలీస్ స్టేషన్లో కిందిస్థాయి సిబ్బంది నుండి పై స్థాయి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమం చూస్తూనే విధులు నిర్వహణలో పటిష్టంగా పనిచేసేలా కృషి చేయాలని తెలిపారు. నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజల రక్షణలో భద్రతలో బాధ్యతగా ఉండాలని ప్రతి ఫిర్యాదుదారునికి నమ్మకం కలిగించేలా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ప్రజలను ఎవరైనా వ్యక్తులు దౌర్జన్యంతో బెదిరింపులకు గురిచేసిన ఇబ్బందులు కలిగించిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు, రౌడీ షీటర్స్ ట్రబుల్ మందసపై జిల్లా వ్యాప్తంగా ప్రతిష్టనిగా ఉంచామని వారి యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు డిజిటల్ జియో ట్యాగింగ్ కు అనుసంధానం చేసి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కేసుల దర్యాప్తులో నైపుణ్యం సాధించాలని ప్రతి కేసును త్వరితగతిన చేదించాలని సూచించారు. ప్రజల భద్రత విషయంలో సీసీ కెమెరాలు అత్యంత ప్రామాణికమైనవని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి అని జిల్లాలో ఎక్కువ మొత్తంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం నేను సైతం కమ్యూనిటీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, సమాజంలో అత్యంత తీవ్రమైన ప్రమాదకరంగా ఉన్న గంజాయిని క్షేత్ర స్థాయిలో నిర్మూలించాలని ఆదేశించారు, రోడ్డు భద్రతా చర్యల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సైబర్ మోసాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు, విధులు చేస్తున్న ప్రదేశంలోనే అందుబాటులో ఉంటూ ఎల్లప్పుడు ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి లు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, డిఎస్పీలు ప్రసన్నకుమార్, రవి, నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరిబాబు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, వెంకటయ్య, నాగేశ్వరరావు, శివశంకర్, రామకృష్ణారెడ్డి, చరమందరాజు మరియు ఐటి టెక్నాలజీ ఆర్ఎస్ఐ రాజశేఖర్ సిబ్బంది ఉన్నారు

## రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు

# 9,340

### ఈ ఏడాది కొత్తగా పెరిగినవి 275

**హైదరాబాద్:** ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరింది. జాతీయ వైద్య కమిషన్ పలు కళాశాలల్లో యూజీ సీట్ల సంఖ్యను పెంచడంతో తాజాగా రాష్ట్రంలో 2025-26 సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సీట్ల సంఖ్య 9,340కి చేరింది. కొత్తగా మూడు ప్రైవేటు వైద్య కళాశాలల్లో సీట్ల సంఖ్యను 200 వరకు పెంచుతూ ఎన్ఎంసీ అనుమతిచ్చింది. అలాగే ఈఎస్ఐ కళాశాలలో మరో 25 సీట్లు అదనంగా పెంచడంతోపాటు, కొడంగల్ కళాశాలకు కొత్తగా అనుమతి రావడంతో 50 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ ఏడాది మొత్తం 275 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయి. కౌన్సెలింగ్‌లో ఇప్పటికే అన్ని కళాశాలలో సీట్ల భర్తీ దాదాపుగా పూర్తయ్యింది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో 70% అమ్మాయిలే చేరారు.



## రైతును రాజును చేయాలన్నదే

# ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రైతును రాజును చేయడం, పేదలకు సొంత ఇల్లు ఇవ్వడం, ప్రతి అర్హుడికి రేషన్ కార్డు, సంక్షేమ ఫలాలు అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో శనివారం ఆయన పర్యటించి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ముజ్జుగూడెం నుండి గువ్వలగూడెం వరకు రూ. 2.60 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు, పైనంపల్లి గ్రామంలో రూ. 15 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెం మండలంలో పాతర్లపాడు నుండి లకావత్ తండా వరకు రూ. 1.32 కోట్ల అంచనా వ్యయంతో, జోగులపాడు నుండి తిలావత్ తండా వరకు రూ. 90 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్లు, రూ. 10 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, జల్లేపల్లిలో రూ. 30 లక్షల అంచనా వ్యయంతో, హైదర్ సాయిపేటలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలులో వెనక్కి తగ్గడం లేదన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని చెప్పారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ క్రింద 21 వేల కోట్లు ప్రభుత్వం ఏర్పడ్డ 9 నెలల్లోనే అందించామన్నారు. రైతు భరోసా సహాయం 12 వేలకు పెంచినట్లు, పోయిన నెలలో ఒకేసారి 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వెల్లడించారు. రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం సరఫరా, 11 లక్షల నూతన రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో 17 లక్షల కొత్త పేర్లు నమోదు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

### సన్న వడ్లకు క్వింటాకి రూ 500 బోనస్

సన్న వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ మొదటి విడత అందించామని, రెండో విడత కూడా అందించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు సొంతిల్లు అందించే పథకం నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వంలో 22 వేల 500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రాబోయే 3 సంవత్సరాలలో మూడు విడతల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ఇళ్ళు కట్టుకున్న స్టేజిని బట్టి లబ్దిదారుని ఖాతాలో డబ్బుకి జమ చేస్తున్నామని తెలియజేశారు. పేదల పక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వమని, ప్రజలు ఆదరించి, ప్రభుత్వానికి వెన్నంటి ఉండాలని మంత్రి పొంగులేటి కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఆర్డీవో నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, పాలేరు ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, నేలకొండపల్లి ఏఎంసి ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు, బీరోలు సొసైటి చైర్మన్ రామసహాయం నరేష్ రెడ్డి, మద్దులపల్లి ఏఎంసి వైస్ చైర్మన్ వనవాసం నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపిపిలు అశోక్, మంగీలాల్, మాజీ ఏఎంసి ఛైర్మన్ శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, పొట్ల కిరణ్, బచ్చలకూర నాగరాజు, అరవింద్ రెడ్డి, బాలాజీ, నల్లబెల్లి లింగన్న, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులుతదితరులు పాల్గొన్నారు.

## జాతర ఉత్సవాలలో, వారంతపు మార్కెట్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### మోమిన్ పెట్ సీఐ జి వెంకట్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వారంతా మార్కెట్లో, జాతర ఉత్సవాల సమయంలో మొబైల్ దొంగతనాలు జరుగుతున్నాయని మోమిన్పేట్ సీఐ జి వెంకట్ తెలిపారు. మోమిన్ పేట్, మర్పల్లి, నవాబుపేట్ మండల వారాంత మార్కెట్లు, జాతరలు, ఉత్సవాల సమయంలో మొబైల్ దొంగతనాలు జరుగుతున్నాయని కొన్ని సందర్భాల్లో దొంగతనానికి గురైన ఫోన్ లో ఉన్న బ్యాంక్, యూపీఐ ద్వారా డబ్బు స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి మార్కెట్‌లలో మీ మొబైల్‌ను పై జేబులో పెట్టుకోవద్దు, ఫోన్ పట్ల దృష్టి పెట్టి చూసుకొనేలా ఉండడం మంచిదని అన్నారు. ఫోన్ దొంగిలించబడితే క్రింద ఈ చర్యలను వెంటనే చేపట్టలని తెలిపారు.

1. వెంటనే దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.
2. మీ సిమ్, ఎటిఎం బ్లాక్ చేయించలి, ఫోన్ పోయిన, దొంగలించబడిన వెంటనే సిమ్ ను బ్లాక్ చేయించలేకపోతే నిందితులు ఓటీపీ ద్వారా దొంగిలించబడిన ఫోన్ ద్వారా ఫోన్ పే, గూగుల్ పే పాస్వర్డు మార్చేసి డబ్బులను ట్రాన్ఫర్ చేసుకుంటారని తెలిపారు.
3. బ్యాంక్ నీ సంప్రదించి మీ యొక్క బ్యాంక్, యూపీఐ సేవల్ని లావాదేవీలను నిలిపి వేయించాలన్నారు.
4. ఫోన్‌లో లాగిన్ అయిన బ్యాంకింగ్, ఇమెయిల్, సోషల్ మీడియా పాస్‌వర్డ్‌లను వెంటనే మార్చలని తెలిపారు.

మోమిన్ పెట్, మర్పల్లి, నవాబుపేట్ మండలంలో మార్కెట్, జాతర ప్రాంతాలలో ప్రజాసంక్షేమానికి, నేరాల నివారణకు ఎస్పీ నారాయణ రెడ్డి, డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సాధారణ దుస్తుల్లో పోలీసులు, అలాగే యూనిఫార్మ్ ఉన్న పోలీసులు నియమించబడ్డారని తెలిపారు. మార్కెట్లకు సమీపంలో పోలీస్ పెట్రోల్ మొబైల్/పోలీస్ వాహనం ఉండీ అక్కడ కూడా పోలీసు వారు అందుబాటులో ఉంటారని తెలిపారు. మార్కెట్లో మొబైల్ దొంగిలించబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో లేదా మార్కెట్‌కు సమీపంలోని పోలీసులు దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేయలని అన్నారు. పోలీస్ వారు మీ సమస్యను తక్షణమే స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ విధంగా ఫోన్ పోయిన, లేదా సైబర్ మోసానికి గురైన ప్రతి కేసులో పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని, మీ సమస్యను వెంటనే పోలీస్ కు తెలియచేసి సహాయాన్ని కోరలని అన్నారు. ప్రజలు ఇలాంటి మోసపూరిత సంఘటనలు ఎదురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చెయ్యండి, ఏ విధమైన సైబర్ సంబంధిత మోసానికి గురి అయినట్లయితే వెంటనే మోమిన్ పెట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి రావాలని మోమిన్ పేట్ సీఐ జి వెంకట్ తెలిపారు.



## లాహెూర్‌లో అల్లర్లు.. 11 మంది హత్య

**లాహెూర్ :** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్–ఇ–లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు గురువారం నుంచి పాక్‌లోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ అల్లర్లలో పంజాబ్ పోలీసులు తమ 11 మంది కార్యకర్తలను హత్య చేసినట్లు ఆ పార్టీ చీఫ్ సాద్ రిజ్వి ఆరోపించారు. ఘర్షణల సమయంలో 24 మందికి పైగా కార్యకర్తలు గాయపడినట్లు పేర్కొన్నారు. వారిని ఆస్పత్రులకు తీసుకువెళ్తే వైద్యం చేయడానికి కూడా అక్కడి వైద్యులు నిరాకరించారన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు ఉద్దేశపూర్వకంగానే దాడులు చేస్తున్నారని సాద్ రిజ్వి ఆరోపించారు. శాంతియుతంగా చేపట్టిన నిరసనలను హింసాత్మకంగా అణచివేయాలని చూస్తున్నారన్నారు. ఎవరి ఆదేశాలతో తమపై కాల్పులు జరుపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. తన నివాసంపై దాడి చేసి..తన తల్లిని, భార్యాపిల్లలను అదుపులోకి తీసుకున్నారని మండిపడ్డారు. గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్–ఇ–లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు గురువారం పాక్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. శుక్రవారం నిరసనకారులు ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి యత్నించడంతో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులను కట్టడి చేసేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్న క్రమంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసనల్లో పలువురు టీఎల్‌పీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఇస్లామాబాద్, లాహెూర్, రావల్పిండిలో నిరసనల కారణంగా పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో ప్రధాన రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రధాన నగరాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఇస్లామాబాద్, రావల్పిండిలో లాక్‌డౌన్ విధించినట్లు అధికారులు పేర్కొన్నారు.

## దక్కని శాంతి బహుమతి.. స్పందించిన ట్రంప్



**వాషింగ్టన్ :** నోబెల్ శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నో ఆశలు పెట్టుకొన్న సంగతి తెలిసిందే. అయితే, ప్రతిష్ఠాత్మకమైన ఆ అవార్డు ఆయనకు దక్కలేదు. దీనిపై తాజాగా ఆయన స్పందించారు. నోబెల్ శాంతి బహుమతి లభించిన వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాదోతో మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈసందర్భంగా ఆమె తన గౌరవార్థం బహుమతిని స్వీకరిస్తున్నట్లు చెప్పారని అధ్యక్షుడు వివరించారు. శుక్రవారం (అమెరికా కాలమానం ప్రకారం) వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నోబెల్ బహుమతి పొందిన మరియాతో నేను ఫోన్‌లో మాట్లాడాను. 'మీ గౌరవార్థం నేను దీన్ని అంగీకరిస్తున్నాను. ఎందుకంటే దీనికి మీరు కూడా నిజంగా అర్హులు' అని ఆమె అన్నారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను ఆమెతో అనలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా" అని ట్రంప్ పేర్కొన్నారు.

## వలపు వలలో పడి.. రక్షణ రహస్యాలు పాక్‌కు చేరవేసి..



**జైపూర్:** వలపు వలలో పడి రాజస్థాన్‌కు చెందిన మంగత్ సింగ్ అనే వ్యక్తి పాక్ మహిళకు భారత రక్షణశాఖ రహస్యాలను చేరవేశాడు. చివరికి రాజస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులకు చిక్కి జైలుపాలయ్యాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పాకిస్థాన్ ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్ కోసం గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలతో రాజస్థాన్ ఇంటెలిజెన్స్ శుక్రవారం అల్వార్‌కు చెందిన మంగత్ సింగ్‌ని అరెస్టు చేసింది. రెండేళ్ల క్రితం సోషల్ మీడియాలో పాక్‌కు చెందిన ఇషాశర్మతో మంగత్ సింగ్‌కు పరిచయం ఏర్పడింది. దీంతో ఆమె కోసం సైన్యం, రక్షణ సంస్థలకు చెందిన కీలక సమాచారాన్ని సేకరించి తెలియజేసేవాడు. అల్వార్ కంటోన్మెంట్ ఏరియా, ఇతర రక్షణరంగ వ్యూహాత్మక కేంద్రాలపై పాక్‌కు అతడు సమాచారం ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. దీనిపై సెంట్రల్ ఎంక్వైరీసెంటర్‌లో వివిధ నిఘాసంస్థలు విచారణ జరుపుతున్నాయన్నారు. ఇదేవిధంగా మంగళవారం రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు చెందిన మహేంద్ర ప్రసాద్ అనే వ్యక్తిని సీఐడీ (భద్రత) నిఘా విభాగం అరెస్టు చేసింది. చందన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లోని డీఆర్‌డీఓ గెస్ట్ హౌస్ మేనేజర్‌గా పనిచేసే మహేంద్ర పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్–సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కోసం గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పాక్‌కు గూఢచర్యం చేసేవారు దేశంలో ఏ మూలన ఉన్నా.. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి నిఘా సంస్థలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నాయని సీఐడీ అధికారులు పేర్కొన్నారు.

# ట్రంప్ మరోసారి సుంకాల బాంబు

### చైనా దిగుమతులపై 100 శాతం సుంకాలు



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బాంబు పేల్చారు. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే చైనాపై 30శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాణిజ్యంపై చైనా అసాధారంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. "చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా వాటికి ఈ సుంకాలు వర్తిస్తాయి" అని అమెరికా అధ్యక్షుడు తన పోస్ట్‌లో వెల్లడించారు. ఇది అన్ని దేశాలను ప్రభావితం చేస్తుందని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపారు. నవంబరు 1 నుంచి లేదా ముందుగానే ఈ టారిఫ్‌లు అమల్లోకి రావచ్చన్నారు. చైనా తీసుకునే తదుపరి చర్యలను బట్టి దీనిపై యూఎస్ నిర్ణయం ఉంటుందన్నారు. అలాగే, క్రిటికల్ సాఫ్ట్‌వేర్‌ను ఇతర దేశాలతో పంచుకోవడంపై నియంత్రణ విధిస్తున్నట్లు వివరించారు. అమెరికా తయారుచేసే దాదాపు ప్రతి ఉత్పత్తి పైనా భారీగా ఎగుమతి ఆంక్షలు విధించాలని చైనా యోచిస్తోందనే నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్.. భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగారు. ఇది జరిగిన కొన్ని గంటలకే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం గమనార్హం. ఇక, గతంలోనూ అమెరికా– చైనాల మధ్య వాణిజ్యయుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ.. అది ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తాజా పరిణామాలు చోటు చేసుకున్నాయి.

## వాట్సప్ లేకపోతేనేం.. అరట్టై వాడండి

### సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** వాట్సప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అరట్టై' పేరు ఇటీవల నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు లోనూ దీని ప్రస్తావన వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అరట్టై వాడొచ్చు కదా అని సూచించింది. అసలేం జరిగిందంటే.. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్టుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తంచేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుంది? అని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. "పిటిషనర్ ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10–12 ఏళ్లుగా వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారు" అని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. "అయితే ఏంటీ? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించొచ్చు కదా..! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అరట్టై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా!" అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. దేశీయ సంస్థ జోహెూ అభివృద్ధి చేసిన అరట్టైకి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. అరట్టై అంటే తమిళంలో పిచ్చాపాటీ సంభాషణ అని అర్థం. ఈ యాప్ ద్వారా మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవటానికి, మీటింగుల్లో పాల్గొనటానికి, స్టోరీలు, ఫొటోలు, డాక్యుమెంట్స్ షేర్ చేసుకోవచ్చు. క్లీన్ ఇంటర్ఫేస్, పలు ఫీచర్లు, గోప్యత మీద దృష్టి పెట్టడం వంటి వాటితో మంచి ప్రత్యామ్నాయ వేదికగా పేరు తెచ్చుకుంటోంది. పాకెట్స్ అనేది అరట్టై ప్రత్యేక త. మనకు కావాల్సిన సమాచారాన్ని ఇందులో స్టోర్ చేసుకోవ చ్చు. త్వరలో చాట్స్‌కు కూడా ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్ తీసుకొస్తామని జోహెూ వ్యవస్థాపకులు శ్రీధర్ వెంబు వెల్లడించారు.

### తమిళనాడు అధికారుల వైఫల్యం వల్లే..

## దగ్గుమందు మరణాలు : కేంద్ర వర్గాలు




**న్యూఢిల్లీ :** దగ్గుమందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కంపెనీని ఇప్పటివరకు వారు ఒక్కసారి కూడా తనిఖీ చేయలేదన్నాయి. దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ పలు వైఫల్యాలను గుర్తించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తన దర్యాప్తులో పలు లోపాలను గుర్తించినట్లు సమాచారం. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని పేర్కొన్నాయి. ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి. ఆ ఫార్మా సంస్థలో ఏ ప్రభుత్వ ఏజెన్సీ ఆడిట్ నిర్వహించలేదని తెలుస్తోంది. అలాగే ఔషధ తయారీ సంస్థగా ఈ కంపెనీ కేంద్ర పోర్టల్‌లో రిజిస్టర్ కాలేదని గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చే గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ సర్టిఫికేట్ లేకుండానే దశాబ్దాల పాటు ఫార్మా సంస్థ నడిచేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతివ్వడాన్ని దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. విచారణలో భాగంగా కేంద్ర బృందానికి రాష్ట్ర అధికారులు సహకరించడం లేదని, ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించింది. కాగా, డ్రగ్స్ తయారీ యూనిట్లను తనిఖీ చేయడంలో కేంద్రం విఫలమైందని ఇప్పటికే తమిళనాడు విమర్శించింది. ఈ అంశంపై తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ.. మరింత హాని జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుందని చెప్పారు. ఇక, కంపెనీ యజమానిని రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

### దిగుమతులపై ఆధారపడొద్దు..

## పప్పుల సాగును పెంచండి

- వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్యమైన పాత్ర
- రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోం దన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

### మూడోవంతు యూపీఐ చెల్లింపులు

## అసురక్షితంగానే : డాట్

**ముంబాయి :** ప్రముఖ పేమెంట్ అగ్రిగేటర్ 'గూగుల్ పే' ఇప్పటివరకు ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ వ్యవస్థలోకి చేరలేదని టెలికాం విభాగం సెక్రటరీ నీరజ్ మిత్తల్ వెల్లడించారు. దీంతో ఆ వేదికగా జరుగుతున్న లావాదేవీలకు ఎలాంటి రక్షణ ఉండటం లేదని వ్యాఖ్యానించారు. ఎఫ్ఆర్ఐలో చేరకపోవడం వల్ల మూడోవంతు యూపీఐ చెల్లింపులు అసురక్షితంగా ఉన్నాయని ఆ విభాగం పేర్కొంది. సైబర్ మోసాలను అరికట్టేందుకు టెలికాం విభాగం 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్ఆర్ఐ)ను ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. బ్యాంకులు, యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు, ఆర్థిక సంస్థలతో ముందుగానే పంచుకున్న సమాచారం ఆధారంగా ఇది పనిచేస్తుంది. డిజిటల్ చెల్లింపులను ఏదైనా మొబైల్ నంబరుకు చేసే సమయంలో ఈ టూల్ తనిఖీ చేస్తుంది. ఏదైనా మొబైల్ నంబరు వల్ల ఆర్థిక మోసం జరిగేందుకు ఎంత అవకాశం ఉందో ఈ రిస్క్ ఇండికేటర్ 'మీడియం', 'హై', 'వెరీ హై'.. ఇలా వర్గీకరిస్తుంది. ఒకవేళ ఏదైనా మొబైల్ నంబరు వల్ల 'హై రిస్క్' ఉంటే.. అదనపు రక్షణ చర్యలను తీసుకునేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లకు వీలుంటుంది. ప్రస్తుతం ఎఫ్ఆర్ఐని ఫోన్‌పే, పేటీఎం వినియోగిస్తున్నాయి. ఇక, దేశంలో జరిగే యూపీఐ లావాదేవీల్లో గూగుల్ పే వాటా 30–35శాతంగా ఉంది.



### అఫ్గాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో

## మహిళలపై 'నిషేధం' వార్తలు..

### స్పందించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిర్‌ఖాన్ ముత్తాఖీ దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంపై విమర్శలు వస్తున్నాయి. ఆ సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారంటూ విపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆమిర్‌ఖాన్ సమావేశంలో మహిళా జర్నలిస్టులు కనిపించలేదంటూ వస్తోన్న కథనాలపై కేంద్రప్రభుత్వం స్పందించింది. ఆ వ్యవహారంలో తమ ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేసింది. శుక్రవారం దిల్లీలోని అఫ్గానిస్థాన్ ఎంబసీలో ముత్తాఖీ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఒక్క మహిళ కూడా కనిపించలేదు. మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా అడ్డుకున్నారని వార్తలు వచ్చాయి. ఇదే విషయాన్ని వెల్లడిస్తూ కొందరు మహిళా పాత్రికేయులు సోషల్ మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇలాంటి చర్యలను ఎలా అనుమతించారని కేంద్రాన్ని ప్రశ్నించారు. మహిళలను అనుమతించనప్పుడు పురుష జర్నలిస్టులు ఆ సమావేశం నుంచి బయటకు వచ్చేయాల్సిందని కేంద్రమాజీ మంత్రి పి. చిదంబరం అన్నారు. ఇది షాకింగ్ ఘటన అని వ్యాఖ్యానించారు.

#### స్పందించిన తాలిబన్ ప్రతినిధి

ముత్తాఖీ పాల్గొన్న మీడియా సమావేశంలో తాము ఉద్దేశపూర్వకంగా మహిళలను మినహాయించలేదని తాలిబన్ అధికారి వెల్లడించారు. "మహిళలపై ఎలాంటి వివక్షాపూరిత విధానం లేదు. పాస్‌ల సంఖ్య పరిమితంగా ఉంది. కొందరికి మాత్రమే అవి అందాయి. ఇదొక సాంకేతిక అంశం మాత్రమే. దీన్నొక విధానపరమైన సమస్యగా చూడొద్దు" అని ఓ జాతీయమీడియా సంస్థతో మాట్లాడారు. పాకిస్థాన్‌తో ఘర్షణల వేళ.. ముత్తాఖీ గురువారం భారత్ పర్యటనకు వచ్చారు. శుక్రవారం విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అయ్యారు. 2021తో తాలిబన్ల ఆక్రమణ తర్వాత అఫ్గాన్ మంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఇదిలాఉంటే.. అఫ్గానిస్థాన్ ను చేజిక్కించుకున్న తాలిబన్లు అక్కడి మహిళల హక్కులను కాలరాస్తున్నారు. మతపరమైన ఆచారాల ముసుగులో మహిళల హక్కులు, స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతుండటంపై అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే.

# హరియాణా ఐపీఎస్ ఆత్మహత్య.. ఎస్పీపై వేటు

**హరియాణా :** హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాపై అధికారులు వేటు వేశారు. పూరన్ ఆత్మహత్యకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో హరియాణా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శత్రుజీత్ సింగ్ కపూర్‌తో పాటు రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాల పేర్లను చేర్చాలంటూ ఆయన భార్య సీనియర్ ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ కుమార్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఎస్పీని పదవి నుంచి తొలగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ (%వాశీఅఱు +ఱఅస్త్రఱ%) అమ్నీత్ కుమార్‌కు లేఖ రాశారు. ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తనను షాక్‌కు గురిచేసిందని.. ఎంతో బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి కోట్లాది మంది భారతీయులు అండగా ఉన్నారంటూ ఆమె రాసుకొచ్చారు. 52 ఏళ్ల పూరన్ కుమార్ స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మంగళవారం చండీగఢ్‌లోని తన నివాసంలో ఆయన రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉండటంతో తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అమ్నీత్ కుమార్ ఆరోపించారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ ఫైల్ చేయగా.. అది అసంతృప్తిగా ఉందని, నిందితులందరి పేర్లు చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.





# లండన్‌లో టీసీఎస్ ఏఐ హబ్, డిజైన్ స్టూడియో

## మూడేళ్లలో 5,000 ఉద్యోగాలు

ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) లండన్‌లో ఏఐ ఎక్స్‌పీరి యెన్స్ జోన్, డిజైన్ స్టూడియోను ప్రారంభించింది. రానున్న మూడేళ్లలో అక్కడ కొత్తగా 5,000 ఉద్యోగాలు సృష్టించనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం టీసీఎస్ యూకేలో నేరుగా, పరోక్షంగా కలిపి 42,000లకు పైగా ఉద్యోగాలను అందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో యూకే ఆర్థిక వ్యవస్థకు 3.3 బిలియన్ పౌండ్లను జత చేసినట్లు టీసీఎస్ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజ్ జీలకు వెల్లడించింది. లండన్‌లో కొత్తగా ప్రారంభించిన ఏఐ ఎక్స్‌పీరియెన్స్ జోన్, డిజైన్ స్టూడియో.. టీసీఎస్ పేస్‌పోర్ట్ మోడల్ ఆధారంగా రూపొందింది. యూకే అంతటా నూతన ఆవిష్కరణలు, వినియోగదారులతో భాగస్వామ్యాన్ని నెలకొల్పేందుకు ఈ కేంద్రం తోడ్పడనుంది. గత నెలలో న్యూయార్క్ లోనూ ఇదే తరహా కేంద్రాన్ని టీసీఎస్ ఏర్పాటు చేసింది. యూకేలో ఉన్న విద్యా సంస్థలు, అంకురాలతో కలిసి పనిచేస్తున్న టీసీఎస్ ఆవిష్కరణల వ్యవస్థను ఇది ఉపయోగించుకుంటుంది. టీసీఎస్ యూకే, ఐర్లాండ్ హెడ్ వినయ్ సింఘ్వీ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా టీసీఎస్‌కు యూకే రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉందన్నారు. ఈ కొత్త కేంద్రంతో దేశ వ్యాప్తంగా మరింత విస్తరించేందుకు వీలవుతుందని తెలిపారు.










## క్లచ్ చెస్‌లో ఆనంద్‌పై కాస్పరోవ్ విజయం

మూడు రోజులపాటు సాగిన క్లచ్ చెస్ లెజెండ్స్ పోరు ముగిసింది. భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, రష్యా స్టార్ గ్యారీ కాస్పరోవ్ మధ్య హెూరాహెూరీగా సాగింది. అయితే, పాయింట్లపరంగా తొలి రెండు రోజులు కాస్పరోవ్‌కు చాలా దూరంగా ఉండిపోయిన ఆనంద్.. మూడో రోజు అద్భుతంగా పుంజుకున్నాడు. కానీ, చివరికి కాస్పరోవ్ విజేతగా నిలిచాడు. మొదటి రెండు రోజులు 8.5 – 3.5తో వెనకబడిన ఆనంద్.. ఆఖరి రోజున అద్భుత విజయాలు నమోదు చేశాడు. కాస్పరోవ్‌తో ర్యాపిడ్ 1 గేమ్‌ను ఆనంద్ డ్రా చేసుకున్నాడు. అయితే, రెండో ర్యాపిడ్ గేమ్‌లో కాస్పరోవ్‌దే విజయం. అయినా పట్టువిడవని ఆనంద్ వరుసగా రెండు బ్లిట్జ్ గేమ్స్‌లోనూ హవా చూపించాడు. విజయం సాధించి బోనస్ కూడా గెలుచుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య వ్యత్యాసం రెండు పాయింట్లకే చేరింది. చివరికి 13–11 తేడాతో కాస్పరోవ్ విజేతగా అవతరించాడు.

### ప్రైజ్‌మనీ ఇలా..

క్లచ్ చెస్ లెజెండ్స్ పోరు మొత్తం ప్రైజ్‌మనీ 1.44 లక్షల డాలర్లు. ఇందులో విజేతగా నిలిచిన వారికి 70వేల డాలర్లు వస్తాయి. రన్నరప్‌గా నిలిచిన ప్లేయర్‌కు 50 వేల డాలర్లు అందుతాయి. అంటే ఇప్పుడు కాస్పరోవ్‌కు 70 వేల డాలర్లు వచ్చాయి. ఇక ఆనంద్ ఖాతాలో 50 వేల డాలర్లు పడ్డాయి. అయితే, ఇక్కడ బోనస్ కూడా అదనంగా వస్తుంది. తొలి రోజు గేమ్‌లు గెలిస్తే 1000 డాలర్లు, రెండో రోజు గెలిస్తే 2వేల డాలర్లు, మూడో రోజు గెలిస్తే 3 వేల డాలర్లు అదనంగా వస్తాయి. ఈ లెక్కన కాస్పరోవ్‌కు అదనంగా మరో 8 వేల డాలర్లు రాగా.. ఆనంద్‌కు 16వేల డాలర్లు దక్కాయి. దీంతో విజేతగా నిలిచిన కాస్పరోవ్‌కు మొత్తం 78 వేల డాలర్లు, రన్నరప్ ఆనంద్‌కు మొత్తం 66 వేల డాలర్లు అందాయి.



## మోసిన్ నఖ్వీకి షాక్ ఇచ్చేందుకు బీసీసీఐ బిగ్ ప్లాన్

ఆసియా కప్ ఫైనల్‌లో పాక్‌పై అద్భుత విజయం సాధించిన భారత్‌కు ట్రోఫీ ఇవ్వకుండా ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ చేసిన రాద్ధాంతం గుర్తుండే ఉంటుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్‌గా ఉన్న అతడి చేతులమీదుగా ట్రోఫీని తీసుకొనేందుకు భారత్ అంగీకరించలేదు. యూఏఈ లేదా ఇతర సభ్యుల నుంచి తీసుకుంటామని తెలిపింది. అయినా సరే మోసిన్ మొండిపట్టుతో వివాదాస్పదంగా మార్చేశారు. దీనిపై బీసీసీఐ ఇప్పటికే ఐసీసీకి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో భారత జట్టుకు నఖ్వీ క్షమాపణలు చెప్పినా ట్రోఫీ మాత్రం ఇంకా అప్పగించలేదు. బీసీసీఐ లేదా టీమ్‌ఇండియా కెప్టెన్ నేరుగా తన వద్దకే వచ్చి ట్రోఫీని తీసుకోవాలనేది అతడి పన్నాగం. కానీ, అది జరిగేలా లేదు. ఈ క్రమంలో క్రికెట్ వర్గాల్లో మరో వార్త వైరల్‌గా మారింది. అసలు నఖ్వీని అంతర్జాతీయ క్రికెట్ మండలి బోర్డు ఆఫ్ డైరెక్టర్ పదవి నుంచే తొలగించేలా బీసీసీఐ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసియా కప్ ఏమీ నఖ్వీ వ్యక్తిగత సొత్తు కాదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గట్టి కౌంటర్ ఇచ్చారు. అయినా పీసీబీ చీఫ్ మాత్రం వెనక్కి తగ్గలేదు. రాజకీయపరమైన ప్రకటనలు కూడా చేయడం అభిమానులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. భారత్ – పాక్ మ్యాచ్‌ల సమయంలో మాత్రం ఆ రెండింటిని వేర్వేరుగా చూడాలని నీతులు చెప్పిన నఖ్వీపై విమర్శలు వచ్చాయి. దీంతో బీసీసీఐ ముమ్మరంగా ఆయనపై చర్యలు తీసుకొనేందుకు రంగం సిద్ధం చేసిందని పీటీఐ చెబుతోంది. "పాక్ క్రికెట్ బోర్డు, నఖ్వీ ముందుముందు ఎలా ప్రవర్తిస్తుందనేది చూడాలి. ట్రోఫీని తనవద్దే ఉంచుకొని.. భారత్‌కు అప్పగించనని చెప్పే హక్కు నఖ్వీకి లేదు. ఆసియా కప్ టోర్నీకి పాక్ అధికారిక ఆతిథ్యం ఇచ్చింది. విజేతగా నిలిచిన టీమ్‌కు ట్రోఫీని ఇవ్వాల్సిందేనని బీసీసీఐ స్పష్టంగా చెప్పింది. నఖ్వీ ధోరణి ఇలాగే కొనసాగితే మాత్రం కఠిన చర్యలకు భారత బోర్డు ఉపక్రమించే అవకాశాలు లేకపోలేదు" అని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.

### నఖ్వీ నుంచి ఆదేశాలు..

"ఇప్పటికీ ఆసియా కప్ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. అక్కడినుంచి కదిలించకూడదని నఖ్వీ నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. ఎవరికీ అప్పగించకూడదని తన సిబ్బందికి చెప్పారు. తన అనుమతి లేకుండా ప్రెజెంటేషన్ ఇవ్వడానికి లేదు. తాను మాత్రమే స్వయంగా భారత జట్టు సారథికి లేదా బీసీసీఐ ప్రతినిధులకు అప్పగిస్తానని నఖ్వీ చెబుతున్నారు" అని ఏసీసీ వర్గాలు తెలిపాయి.

# టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శన

## రెండో రోజు ముగిసిన ఆట.. విండీస్ 140/4




**దిల్లీ:** వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో ఇన్నింగ్స్ విజయం సాధించిన టీమ్‌ఇండియా.. రెండో టెస్టులోనూ అదే సీన్ రిపీట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అరుణ్‌జైట్లీ స్టేడియంలో జరుగుతున్న రెండో టెస్టులో టీమ్‌ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతోంది. తొలి ఇన్నింగ్స్‌ను 518/5 వద్ద డిక్లేర్ చేసిన భారత్.. బంతితోనూ కరేబియన్ జట్టుకు కళ్లెం వేస్తోంది. రవీంద్ర జడేజా (3/37) విజృంభించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 140/4 స్కోరుతో నిలిచింది. టెవిన్ ఇమ్లాచ్ (14, 31 బంతుల్లో బ్యాటింగ్), షైయ్ హెూప్ (31, 46 బంతుల్లో బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. వెస్టిండీస్ టీమ్ ఇంకా 378 పరుగుల వెనుకంజలో ఉంది. విండీస్ ఓపెనర్లు జాన్ కాంప్‌బెల్ (10), త్యాగ్‌నారాయణ్ చందర్‌పాల్ (34)ను రవీంద్ర జడేజా పెవిలియన్‌కు పంపాడు. కాంప్‌బెల్ బలమైన స్లాగ్ స్వీప్ షాట్ ఆడగా.. ఫార్వర్డ్ షార్ట్‌లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సాయి సుదర్శన్ సూపర్ క్యాచ్ అందుకున్నాడు. త్యాగ్ నారాయణ్.. కేఎల్ రాహుల్‌కు చిక్కాడు. కొద్దిసేపటికే అథనాజ్ (41, 84 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)ను కుల్‌దీప్ వెనక్కి పంపాడు. తర్వాతి ఓవర్‌లోనే రోస్టన్ ఛేజ్ (0) జడేజాకు రిటర్న్ క్యాచ్ ఇచ్చాడు. అంతకుముందు 318/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమ్‌ఇండియా మూడు వికెట్లు కోల్పోయి మరో 200 పరుగులు జోడించింది. 173 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్ (175, 258 బంతుల్లో 22 ఫోర్లు) డబుల్ సెంచరీ చేసే అవకాశాన్ని మిస్ చేసుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (129, 196 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్స్‌లు (ఓవర్‌నైట్ స్కోరు 20) శతకంతో మెరిశాడు. ఆట మొదలైన కాసేపటికే జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. నాన్ స్ట్రైకింగ్ ఎండ్‌లో ఉన్న గిల్ పరుగు కోసం రాకపోవడంతో రనౌటయ్యాడు. నిలకడగా ఆడిన నితీశ్ రెడ్డి (43, 54 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ధ్రువ్ జురెల్ (44, 79 బంతుల్లో 5 ఫోర్లు) అర్ధ శతకాల ముంగిట ఔటయ్యారు.

## కంగారు పడొద్దు.. మేమే అప్‌డేట్ చేస్తాం : సీఎస్కే

వచ్చే ఏడాది ఐపీఎల్ ముంగిట మినీ ఆక్షన్ జరగనుంది. ఈలోగా ఓ ఐదుగురు క్రికెటర్లను వదిలేసేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఉంది. దీంతో ఏ జట్టు ఎవరిని వదిలేస్తుందో క్రికెట్ విశ్లేషకులు అంచనా వేయడం ప్రారంభించారు. అందులోభాగంగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నుంచి ఐదుగురిని రిలీజ్ చేస్తుందని క్రిక్‌బజ్ రిపోర్ట్ పేర్కొంది. అయితే, దానిపై సీఎస్కే తన సోషల్ మీడియా ఖాతాలో స్పందించింది. ఆ నివేదిక ప్రకారం.. సామ్ కరన్, దీపక్ హుడా, విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి, డేవన్ కాన్వేను వదిలేస్తుందని అంచనా వేసింది. ఓవర్సీస్ ప్లేయర్ల జాబితాలో కాన్వే, కరన్ ఉండటంతో అభిమానులు సర్‌ప్రైజ్‌కు గురయ్యారు. ఓపెనర్‌గా కాన్వే చాలా దూకుడుగా ఆడతాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో కరన్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగలడు. కానీ, గత సీజన్‌లో వీరిద్దరూ తేలిపోవడం మేనేజ్‌మెంట్‌కు రుచించలేదు. అందుకే, పక్కన పెడుతుందని ఐపీఎల్ వర్గాలు అంచనా వేశాయి. దీంతో నేరుగా సీఎస్కేనే స్పందించింది. కాస్త ఘాటుగా కాకుండా.. సరదా మ్యానర్‌తో పోస్టు పెట్టింది. 'ఎవరూ కంగారు పడొద్దు. మేమే అప్‌డేట్ చేస్తాం' అని పేర్కొంది. ఐదుగురిని రిలీజ్ చేయడం వల్ల సీఎస్కే వద్ద భారీ మొత్తమే మిగలనుంది. రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్‌కూ వీడ్కోలు పలకడంతో అతడి విలువ కూడా మిగలనుంది.




# జోరుగా రోహిత్ సాధన..

ముంబయి: ఆస్ట్రేలియా పర్యటనకు ముందు భారత స్టార్ బ్యాటర్ రోహిత్‌శర్మ సాధన జోరుగా సాగుతోంది. ముంబయి మాజీ సహచరుడు అభిషేక్ నాయర్ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు రెండు గంటల పాటు అతడు ప్రాక్టీస్ చేశాడు. భారీ షాట్‌లు ఆడుతూ కనిపించాడు. ఈ క్రమంలో రోహిత్ కొట్టిన భారీ సిక్స్ దెబ్బకు బంతి వెళ్లి పార్కింగ్‌లో ఉన్న తన లంబోర్గిని కారు అద్దాలను బద్దలు కొట్టడం గమనార్హం. శివాజీ పార్క్‌లో రోహిత్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. ప్రాక్టీస్ అయిన తర్వాత వెళ్లేందుకు సిద్ధమవుతున్న రోహిత్ వద్దకు ఓ చిన్నారి అభిమాని వచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే, రోహిత్ సెక్యూరిటీ సిబ్బంది ఆ పిల్లాడిని ఆపేందుకు ప్రయత్నించారు. దీనిని గమనించిన రోహిత్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ వీడియో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. చివరికి ఆ చిన్నారితో రోహిత్ మాట్లాడాడు. నెట్స్ సెషన్‌లో రఘువంశీ సహా మరికొంత మంది ఆటగాళ్లు పాల్గొన్నారు.



ఈనెల 19న పెర్త్‌లో ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆరంభమవుతుంది. రోహిత్ భారత్ తరఫున చివరగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడాడు.



## చైనాపై టారిఫ్‌ల ఎఫెక్ట్..

### అమెరికా మార్కెట్లు అల్లకల్లోలం


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై సుంకాల బాంబు పేల్చారు. బీజింగ్ దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలతో విరుచుకుపడ్డారు. ఈ పరిణామాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే అమెరికా మార్కెట్లలో 1.5 ట్రిలియన్ డాలర్ల మేర మదుపర్ల సంపద ఆవిరైంది. మార్కెట్లు ముగిసే సమయానికి నాస్‌డాక్ 3.56 శాతం, డోజోన్స్ 1.90శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 2.71శాతం మేర నష్టపోయాయి. అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్ భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన కొన్ని గంటలకే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం గమనార్హం. దీంతో రెండు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం నడుస్తుందనే భయాలు నెలకొన్నాయి. దాంతో అమెరికా మదుపర్ల సంపద 1.5 ట్రిలియన్ డాలర్ల మేర ఆవిరవగా.. క్రిప్టో మార్కెట్‌లో 19 బిలియన్ డాలర్ల మేర అమ్మకాలు చోటుచేసుకున్నాయి. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో అమ్మకాలు జరగలేదు. చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసినా ఈ సుంకం వర్తిస్తుంది. నవంబర్ ఒకటి లేదా అంతకంటే ముందే ఈ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయని ట్రంప్ హెచ్చరించారు. గతంలోనూ అమెరికా–చైనాల మధ్య వాణిజ్య యుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ.. అది ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య మరోసారి వాణిజ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి.




## మనీలాండరింగ్ కేసు..

### అనిల్ అంబానీ సన్నిహితుడి అరెస్టు

రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ రూ.17వేల కోట్ల మేర రుణాల మోసం ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. అనిల్ సన్నిహితుడు, రిలయన్స్ పవర్ లిమిటెడ్ సీనియర్ అధికారి అశోక్ కుమార్ పాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. రిలయన్స్ పవర్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కూడా అశోక్ కుమార్ ఉన్నారు. రూ.68.2 కోట్ల విలువైన నకిలీ బ్యాంక్ గ్యారెంటీకి సంబంధించి ఆయన ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించి దిల్లీ కార్యాలయంలో అశోక్‌ను ప్రశ్నించిన తర్వాత ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రూ.17వేల కోట్ల బ్యాంకు మోసం కేసులో రిలయన్స్ పవర్ సహా అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలపై ఈడీ దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.




## జీమెయిల్ నుంచి జోహెూమెయిల్‌కి మారాలనుకుంటున్నారా?

దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో.. కేంద్రమంత్రి అమిత్ షా జీమెయిల్ నుంచి జోహెూ మెయిల్‌కి మారారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు దేశీయంగా అభివృద్ధి చేసిన జోహెూకు సేవలకు మారుతున్నట్లు తెలిపారు. దీంతో కంపెనీ పేరు మారుమోగుతోంది. జోహెూ వినియోగదారుల గోప్యతను కాపాడుతూ, ప్రకటనలు లేకుండా సేవలను అందిస్తుంది. వ్యాపారులు, నిపుణులు ఎక్కువగా ఉపయోగించే ఈ ప్లాట్‌ఫాం కస్టమ్ డొమైన్ ఇమెయిల్స్, సులభమైన ఇంటర్‌ఫేస్, గోప్యతా రక్షణలు వంటి సదుపాయాలతో ఆకట్టుకుంటోంది. తక్కువ ఖర్చుతో ప్రొఫెషనల్ స్థాయి టూల్స్ అందిస్తుంది. వ్యక్తిగత లేదా వ్యాపార డొమైన్ పేరుతో ప్రత్యేకమైన ఇమెయిల్ అడ్రస్ సృష్టించుకునే సదుపాయం ఉంది. అంతేకాకుండా, డిస్ట్రాక్షన్–ఫ్రీ ఇన్‌బాక్స్ అనుభవం కల్పిస్తుంది. జీమెయిల్ నుంచి జోహెూ మెయిల్‌కి మారడం చాలా సులభం. మీ మెయిల్స్, కాంటాక్ట్స్ ఏవీ కోల్పోకుండా మారొచ్చు. అదెలాగో చూద్దాం..

- గూగుల్ ప్లేస్టోర్ లేదా యాప్‌స్టోర్ నుంచి జోహెూ మెయిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయండి. లేదంటే జోహెూమెయిల్ వెబ్‌సైట్‌లో కూడా ఖాతా సృష్టించవచ్చు.
- ఇప్పుడు మీ వ్యాపారం కోసం అయితే బిజినెస్ ఇమెయిల్, వ్యక్తిగతంగా అయితే పర్సనల్ ఇమెయిల్‌పై క్లిక్ చేయండి.
- మీ జీమెయిల్ ఖాతాలోకి వెళ్లి Settings> See all settings> Forwarding and POP/IMAP క్లిక్ చేయండి.
- తర్వాత IMAP ను ఎనేబుల్ చేయండి. దీని ద్వారా జోహెూ మెయిల్ మీ జీమెయిల్ డేటాను యాక్సెస్ చేసి ట్రాన్స్‌ఫర్ చేస్తుంది.
- జోహెూ మెయిల్‌లో Settings> Import/Export ఎంపికను ఓపెన్ చేయండి.
- అక్కడ Migration Wizard ద్వారా జీమెయిల్ నుంచి మీ ఇమెయిల్స్, ఫోల్డర్లు, కాంటాక్ట్స్ అన్నీ ఇంపోర్ట్ చేయొచ్చు.
- కొత్తగా వచ్చే మెయిల్స్ కూడా జోహెూ ఖాతాకి రావాలంటే, జీమెయిల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి Email forwarding ఎంపికలో మీ కొత్త Zoho Mail చిరునామాను నమోదు చేయండి.

# రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం రౌడీ జనార్దన్ ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. రాజావారు రాణిగారు సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.



# ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా : అట్లీ

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన కాంతార చాప్టర్ 1పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. కాంతార 1ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉ ఒడడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.





# సిద్ధు అలా చేస్తాడని ఊహించలేదు

**- రాశీ ఖన్నా**

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా 'తెలుసు కదా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రలో నటించారు. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 17న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, ప్రమోషన్స్ జోరు పెంచిన రాశీఖన్నా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేసింది. "సిద్ధు జొన్నలగడ్డ గురించి అందరూ అనుకున్నట్లే నేను కూడా చాలా సరదాగా ఉంటాడని అనుకున్నాను. కానీ 'తెలుసు కదా' సెట్స్‌లో అతన్ని చూసి నేను నిజంగా షాక్ అయ్యాను. షూటింగ్‌లో చాలా సీరియస్‌గా ఉ ఒడేవాడు. ఫ్రేమ్ సెట్ చేయగానే మళ్లీ వెంటనే పాత్రలోకి పూర్తిగా లీనమై పోయేవాడు. సిద్ధు తన పనిని, నటనకు చాలా గౌరవిస్తాడు. అందుకే పని విషయంలో అతను అంత సీరియస్‌గా ఉంటాడు. నేను అలా చేస్తాడని ఊహించలేదు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ గురించి తెలుసుకున్న వారు కూడా ఆశ్చర్యపోతున్నారు.

# ఎంగేజ్‌మెంట్.. పెళ్లి వార్తలు.. అంతా సీక్రెట్

## ఎంగేజ్మెంట్ రింగులతో దర్శనమిస్తున్న రౌడీజంట

వారం రోజులుగా సోషల్ మీడియాను ఓ వార్త కుదిపేస్తోంది. రష్మిక, విజయ్ దేవరకొండ ఎంగేజ్ మెంట్ జరిగిందని.. ఫిబ్రవరిలో పెళ్లి అంటూ ఒకటే రూమర్లు. సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకు ఇదే వైరల్ అవుతోంది. కానీ ఈ జంట మాత్రం సైలెంట్ గా ఉంటుంది. తమకు అసలు ఎంగేజ్ మెంట్ అయిందో లేదో అనే విషయంపై కూడా క్లారిటీ ఇవ్వట్లేదు. ఎలాంటి ఫొటోలు బయటకు రాకుండానే ఈ వార్తలు దేశ వ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి. పెళ్లి విషయంలో ఎందుకు ఇంత సస్పెన్స్‌గా ఉంచుతున్నారో ఎవరికీ అర్థం కావట్లేదు. కనీసం తమ అభిమానుల కోసమైనా.. ఎంగేజ్ మెంట్ గురించి చెప్పొచ్చు కదా. అలా చెప్పకుండా ఎవరి సినిమాల్లో వారు బిజీగా ఉంటున్నారు. ఇన్ని రోజులు ప్రేమ విషయంలో ఎలాగూ సస్పెన్స్ మెయింటేన్ చేశారు. ఇప్పుడు ముఖ్యమైన పెళ్లి విషయంలో ఎందుకు ఇంత సీక్రెట్. వీళ్లు స్పందించకపోయేసరికి అసలు నిజంగా ఎంగేజ్ మెంట్ జరిగిందా లేదా అనే అనుమానాలు పెరుగుతున్నాయి. రకరకాల రూమర్లు వస్తున్నాయి. అక్టోబర్ 3న వీరి నిశ్చితార్థం జరిగిందని సన్నిహితులు వెల్లడించినట్లు వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా వీరిద్దరూ ఉంగరాలు పెట్టుకొని కనిపించడంతో వీరి ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఇటీవల విజయ్ దేవరకొండ పుట్టపర్తి వెళ్లారు. అక్కడ ఆయన చేతికి బంగారపు ఉంగరం కనిపించడంతో అందరూ అది ఎంగేజ్‌మెంట్ రింగ్ అంటూ ఫొటోలు షేర్ చేశారు. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. తన అప్‌కమింగ్ సినిమా థామాలోని నువ్వు నా సొంతమా పాట గురించి అందులో రాసుకొచ్చారు. అందులో రష్మిక చేతికి వజ్రపు ఉంగరం కనిపించడంతో మరోసారి వీరి ఎంగేజ్‌మెంట్ వార్త వైరల్ అవుతోంది. వీరిద్దరూ కలిసి గీత గోవిందంలో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. దీని తర్వాత డియర్ కామ్రేడ్‌తో అలరించారు. ప్రస్తుతం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఇందులోనూ రష్మికనే కథానాయికగా కనిపించనున్నట్లు తెలుస్తోంది.



# సిద్ధూ సినిమా.. ఓ రొమాంటిక్ డ్రామా

## హీరోయిన్ శ్రీనిధిశెట్టి



కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందు కురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయోలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

# లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు మ-ఌస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.





# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

## బిగిబి అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్

బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే..శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన కల్కి 2898 ఏడీ థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం కల్కి2కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com